

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

శుక్రవారం, 14 నవంబర్ 2025 | 8 పేజీలు

మోసపోయిన రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-సింహాద్రిపురం: మోసపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీ అవినాష్ రెడ్డి డిమాండ్ చేశారు. రబీలో రైతులు తమ పంటల సాగు కోసం శనగల విత్తనాలను, ఎరువులను కొనుగోలు చేసేందుకు ఆర్‌బీకెలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్ రెడ్డికి దాదాపు రూ.20లక్షల నగదును చెల్లించారు. నగదుతో పరారైన విషయం అందరికీ విధితమే. ఈ విషయంగా ఎంపీ అవినాష్ రెడ్డి గురువారం అంకాలమ్మ గూడూరులోని మోసపోయిన రైతుల సమస్యలను తెలుసుకోవడానికి వెళ్తున్న పోలీసులు 144, కర్ఫ్యూ , విధించారు. ఎంపీ, సంబంధిత రైతులతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ రమణ, ఎస్సై రవికుమార్‌లకు రైతుల సమస్యల వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోసపోయిన ప్రతి రైతును కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల నగదుతో వీహెచ్ఎ పరారై మూడు వారాలు గడుస్తున్న కలెక్టర్, ఎస్పీలకు పలుమార్లు ఫిర్యాదు చేసిన ఎలాంటి స్పందన లేదన్నారు రైతులకు అన్యాయం జరిగిన కూడా అధికారులు కానీ, కూటమి నాయకులు కానీ, ఎటువంటి పరిష్కారం చేయలేదన్నారు. రైతులకు న్యాయం చేయాలన్నారు. కాని పక్షంలో వైసిపి తరపున పెద్ద ఎత్తున నిరసన చేపడతామని ఆయన పిలుపునిచ్చారు.

అంకితభావంతో పనిచేయండి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి ప్రమాణ కార్యక్రమానికి హాజరైన మంత్రులు

విశాలాంధ్ర-మదనపల్లె: పదవిని బాధ్యతగా స్వీకరించి రైతాంగం సంక్షేమం కోసం అంకితభావంతో కృషి చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం మదనపల్లిలోని నీరుగట్టుపల్లి మెయిన్ రోడ్ లో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ మదనపల్లి ప్రాంతంలో మనం ఉండడం ఎంతో అదృష్టంగా భావించాలని, దేశానికి స్ఫూర్తిని ఇచ్చిన మన జాతీయ గీతం రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లిలోని బెసెంట్ థియోసాఫికల్ కళాశాలలో బస చేసినప్పుడు జనగణమనను బెంగాలీ నుండి ఆంగ్లంలోకి అనువదించారని, యానీ బిసెంట్ కళాశాల గొప్ప చరిత్ర కలిగినదని గొప్ప ప్రాంతం మదనపల్లి అని తెలియజేశారు. ఇలాంటి ప్రాంతంలో కూటమి ప్రభుత్వ భాగస్వామ్యంతో

పవన్ కళ్యాణ్ నాయకత్వంలో మదనపల్లి టమేటా మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న వారందరికీ అభినందనలు తెలియజేస్తూ.. అలాగే ఈరోజు ప్రమాణ స్వీకారం చేసిన వారందరూ గత పాలకులు చేసిన విధంగా కాకుండా ఒక ప్రత్యేక మార్పు తీసుకురావాలి, సమాజంలో అందరం కూడా ఆదర్శవంతంగా నిలబడాలి విధంగా పనిచేయాలని అన్నారు. ఒక మంచి ఆలోచనలు, నాయకత్వ లక్షణాలు ఉన్నటువంటి వారిని నియమించాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వంలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి సారథ్యంలో ఈ రోజున జంగాల శివరాం కరెక్ట్ పర్సన్‌గా నియమించడం జరిగిందని అన్నారు.

..మిగతా 2లో

కిడ్నీ రాకెట్ ఉదంతం..

ప్రభుత్వం సీరియస్

- ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదు
- ఉన్నత స్థాయి కమిటీతో రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు
- ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

విశాలాంధ్ర-మదనపల్లె: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన, మదనపల్లె పట్టణ కేంద్రంగా సాగిన కిడ్నీ మార్పిడి ఆపరేషన్ ఉదంతంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. గురువారం మార్కెట్ కిమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి విచ్చేసిన మంత్రి కిడ్నీ రాకెట్ ఉదంతం పై విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి అనుమతులు లేకుండా కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేపట్టి మహిళ ప్రాణాలు పోవడానికి కారణమైన వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. జిల్లా వైద్యాధికారిగా ఉంటూ ఇలాంటి వాటిని అరికట్టాల్సిన ప్రభుత్వ వైద్యుడే ఇలాంటి వాటికి ఊతమిచ్చే విధంగా వ్యవహరిస్తూ స్వతహాగా ఆసుపత్రి ఏర్పాటు చేసి ఇలాంటి వాటికి కేరాఫ్ అడ్రస్‌గా మారడం చాలా దురదృష్టకరమన్నారు. అతనిపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, ఇందులో ప్రమేయమున్న

..మిగతా 2లో

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

- జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: జిల్లాలో సహకార సంఘాలను బలోపేతం చేయడంలో మరింత కృషి చేయాలని.. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సభ్యులులను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో.. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సహకార బ్యాంకుల్లో స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. రైతు సంఘాలకు అన్ని విధాలా ప్రోత్సాహం అందించాలన్నారు. జిల్లాలో డిసిసిబి అనుబంధంగా నడుస్తున్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ప్రాజెక్ట్ యొక్క కంప్యూటరైజేషన్, ఎంపీఎఫ్ సి గోడౌన్ల నిర్మాణం, కామన్ సర్వీసు సెంటర్ల నిర్వహణ, పెట్రోల్ ఔట్ లెట్స్ నిర్వహణ, ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రాల (పిఎంబీజే ఏకే)నిర్వహణపై ప్రోత్సాహం తదితర అంశాల్లో జిల్లా సహకార కేంద్రం నిర్వహణ, అభివృద్ధి పురోగతిపై సమీక్షించి జిల్లా కలెక్టర్ పలు సూచనలిచ్చారు. అనంతరం అఖిలభారత సహకార వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ డిసిబి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీవో వెంకట సుబ్బయ్య, డిసిబి సీఈవో రాజామణి, నాబార్డు ఎజిఎం విజయవిహారీ, డీసీవో సుభాషిణి, డిపివో రాజ్యలక్ష్మి, జిల్లా వెటర్నరీ, మార్కెటింగ్, ఆప్కాబ్ అధికారులు, బ్యాంకు అధికారులు అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక భారత నిర్మాణ శిల్పి

విశాలాంధ్ర-పులివెందుల: భారత మాజీ ప్రధాని స్వర్గీయ జవహర్ లాల్‌ను ఆధునిక భారత నిర్మాణ శిల్పి అని పిలుస్తారు. ఆయన స్వరూప రాణి నెహ్రూ మోతిలాల్ నెహ్రూ దంపతులకు 1889నవంబర్ 14న జన్మించారు. నెహ్రూ పుట్టినరోజును ప్రతిఏటా దేశమంతటా బాలల దినోత్సవం జరుపుకుంటారు. నెహ్రూగారు చిన్ననాటి నుంచే ప్రతిభావంతులు. ఇంగ్లాండ్‌లోని హారో స్కూల్లో చదివి, తర్వాత లిలికేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో నేచురల్ సైన్స్‌లో పట్టభద్రులయ్యారు. తరువాత లండన్‌లోని ఇన్నర్ టెంపుల్లో న్యాయవిద్య అభ్యసించారు. భారత్ తిరిగి వచ్చి న్యాయవృత్తి ప్రారంభించారు.

రచనలు

నెహ్రూగారు గొప్ప రచయిత కూడా డిస్కవరీ ఆఫ్ ఇండియా, గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ, లెటర్స్ ఫ్రమ్ ఏ ఫాదర్ టు హిస్ డాటర్ అనే గ్రంథాలు ఆయన ఆలోచనా లోతును ప్రతిబింబిస్తాయి. స్వాతంత్ర్య భారత తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా ప్రతీ ఏడాది నవంబర్ 14న జరుపుకుంటారు. చిన్నారులను అమితంగా ప్రేమించిన నెహ్రూగారిని పిల్లలు ముద్దుగా చాచా నెహ్రూ అని పిలిచేవారు. బాలల దినోత్సవం పిల్లల హక్కులు, విద్య, ఆరోగ్యం, సంరక్షణ పట్ల సమాజం దృష్టి సారించే రోజు. పిల్లలలో ఉన్న కలలు నెరవేర్చేందుకు ప్రతి తల్లిదండ్రి, ఉపాధ్యాయుడు, ప్రభుత్వ సంస్థలు కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇవాళ పిల్లలు - రేపటి దేశభవిష్యత్తు అనే సూత్రాన్ని మనమందరం ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన బాలల దినోత్సవం అవుతుంది.

స్వాతంత్ర్య పోరాటం

మహాత్మా గాంధీ ప్రభావంతో స్వాతంత్ర్య ఉద్యమంలో చేరారు. అసహకార ఉద్యమం, సివిల్ డిజ్ ఓబిడియెన్స్, క్విట్ ఇండియా వంటి ఆందోళనల్లో చురుకైన పాత్ర పోషించారు. ఎన్నో సార్లు జైలుకెళ్లారు. 1947 ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు, ఆయన భారత తొలి ప్రధానమంత్రిగా నియమితులయ్యారు.

ప్రధానమంత్రి హెూదాలో చేసిన కృషి

దేశ అభివృద్ధికి ప్రణాళికా ఆర్థిక వ్యవస్థను ప్రవేశపెట్టారు. భారీ పరిశమలు, అణు శక్తి, అణు పరిశోధన, శాస్త్ర సాంకేతిక రంగాలులో పునాది వేశారు. భారత అంతరిక్ష, రక్షణ, విద్య, వ్యవసాయం రంగాల్లో విస్తృత మార్పులు తెచ్చారు. ప్రాజెక్టులు దేశ దేవాలయాలు అని చెప్పి నీటిపారుదల ప్రాజెక్టుల ప్రాముఖ్యతను ఎత్తి చూపారు.

సర్వే నెంబర్లు గోల్డెన్ రికార్డులుగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: భూ రికార్డుల స్వచ్ఛీకరణ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల్లోని రెవెన్యూ రికార్డులను గోల్డెన్ రికార్డులుగా తీర్చిదిద్దే చర్యలను ముమ్మరం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలో చోటుచేసుకున్న భూ సమస్యలపై.. రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణతో గోల్డెన్ రికార్డుల సాధన కోసం సంబంధిత రెవెన్యూ అధికారులతో ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగాజిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు.. జేసీ అదితి సింగ్, బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, కుడా సెక్రెటరీ శిరీష హాజరయ్యారు. ఇందులో భాగంగా బి.మఠం మండలానికి ఏర్పాటు చేసిన 20 మంది విఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో కూడిన ప్రత్యేక టీమ్ సభ్యులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో గతంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది తప్పిదాల వల్ల భూ ఆక్రమణలు, భూ రికార్డుల్లో తప్పిదాలు జరిగాయన్నారు. ప్రత్యేకించి బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలతో పాటు, బి.మఠం మండలంలో అధిక సంఖ్యలో భూ సమస్యలు ఉన్నట్లు.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదులు అందడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక టీముల ద్వారా అన్ని గ్రామాలలో రెవెన్యూ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. అందులో భాగంగానే ప్రతి సర్వే నెంబర్ ను, సంబంధిత విస్తీర్ణాన్ని ఆర్ఎస్ఆర్, వెబ్ ల్యాండ్ ద్వారా నమోదు చేయడం జరుగుతోందన్నారు. పట్టా, అసైన్డ్ భూ రికార్డులన్నిటినీ ఒక ఎస్ఓపి ప్రకారం పట్టాదారు, అనుభవదారు, 22 ఏ, డికేటీ, పివోటీ భూములు, వ్యక్తి పేరు, ఊరి పేరు, ఖాతా నెంబరు తదితర వాటిని వెరిఫై చేసి రికార్డుల వర్గీకరణ చేయడం జరుగుతుందన్నారు. అత్యంత ప్రాధాన్యతతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎటువంటి తప్పిదాలు, ఎలాంటి వ్యక్తిగత, రాజకీయ ప్రమేయం లేకుండా పారదర్శకంగా వెరిఫికేషన్ చేయాలని ప్రత్యేక టీమ్ సభ్యులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి ఆటంకాలు రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎలాంటి కోర్టు వ్యవహారాలు, కుటుంబ వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పన కోసమే ఈ కార్యక్రమాన్ని ఆధునిక పరిజ్ఞానంతో చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, తహశీల్దార్లు విఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

కిడ్నీ రాకెట్ ఉదంతం ప్రభుత్వం సీరియస్

మొదటి పేజీ తరువాయి

అందరిని కఠినంగా శిక్షిస్తామని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాన్స్ ప్లాంటేషన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ 1994యాక్ట్ ప్రకారం కిడ్నీ మార్పిడి చేయాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అన్నారు. మదనపల్లె గ్లోబల్ ఆసుపత్రికి అలాంటి అనుమతులు లేవని, కావున ఈ సమస్యను తేలికగా తీసుకోవడం లేదన్నారు. పోలీసులు సైతం ఇప్పటికే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారని, లోతుగా దర్యాప్తు చేస్తున్నారన్నారు. చిత్తూరు డిసిహెచ్ఎస్ ఆధ్వర్యంలో ఓ ప్రత్యేక వైద్యబృందాన్ని ఏర్పాటు చేశామని, ఈ కిడ్నీ రాకెట్ ఉదంతంపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి నివేదిక ఆధారంగా బాధ్యులపై క్రిమినల్ కేసులతో పాటు శాఖపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వైద్య వృత్తిలో ఉంటూ ఇలాంటి దురాగతాలకు పాల్పట్టడం దుర్మార్గమని అలాంటి వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని మరోసారి స్పష్టం చేశారు. ఇలాంటివి పురావృత్తం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత స్థాయి కమిటీతో అన్ని ఆసుపత్రులను తనిఖీలు చేపట్టి పకడ్బందీ చర్యలు తీసుకుంటామని మంత్రి సత్య కుమార్ స్పష్టం చేశారు.

క్లీన్ అండ్ గ్రీన్ విలేజెస్‌పై శిక్షణా తరగతులు



విశాలాంధ్ర-కడప: వల్లూరు మండలంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులుకు, వివోఏలకు, సిఆర్పిలకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ నెల 13, 14 తేదీలలో 2 రోజులు థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ అనే అంశంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వల్లూరు మండల ఎంపీడీవో రఘురాం పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మండలంలోని అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో అన్ని శాఖలలో ఏమైనా సమస్యలుంటే ఈ శిక్షణ తరగతులలో చర్చించుకుని గ్రామీణ ప్రాంతాల్లో అన్ని రకాల అభివృద్ధి పనులు మెరుగు పరిచేందుకు ప్రణాళికలపై చర్చించుకున్నట్లు తెలిపారు. అలాగే పచ్చదనము పరిశుభ్రతపై ప్రజలందరికీ అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మొక్కలను పరిరక్షించాలని అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని స్వచ్ఛమైన గాలి ప్రతి ఒక్కరికి అందేలా పచ్చదనం పరిశుభ్రత పై ప్రత్యేక అవగాహన కల్పించాలని సూచించారు ఈ కార్యక్రమంలో మండలంలోని ఈవోపీఆర్డి శ్రీధర్ మండలాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి

మొదటి పేజీ తరువాయి

అదేవిధంగా ఆరు సంవత్సరాల క్రితం డిసెంబర్ మాసంలో 2019లో ఎన్నికలు అయిపోయిన తర్వాత ఆ రోజున టమాటో రైతులు పడుతున్న కష్టాల గురించి సోదరుడు రామదాస్ చౌదరి గారితో మాట్లాడితే ఇక్కడ ఉన్న వాస్తవ పరిస్థితులు వివరించారని, ఈ విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగానే మనం వెళ్లి కలుద్దాం రైతుల సమస్య ఏంటో మనం కూడా తెలుసుకుందాం అని ఈ ప్రాంతాన్ని పర్యటించి రైతుల కష్టాలను తెలుసుకుని రైతాంగాని కోసం మన ప్రాంతం కోసం ఇక్కడ వాళ్ళు పడుతున్న కష్టాల కోసం కచ్చితంగా మనం నిలబడాలని ఆనాడే నిర్ణయించడం జరిగిందని అన్నారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా గుర్తు పొందిన మదనపల్లి మండికి మరింత పేరు ప్రఖ్యాతలు తెస్తానని, మండీలో వసతులు పెంచి, రైతులు తమ పండించిన టమాటా పంటను మద్దతు ధర అందించే విధంగా, అలాగే అధిక ఎగుమతులను అందించే విధంగా కృషి చేయాలని అన్నారు. మదనపల్లి టమాటో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారం చేసిన జంగాల శివరాంకి, జనసేన పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీ నుంచి ఆంజనేయులుకి, భారతీయ జనతా పార్టీ నుంచి కూడా డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సంధ్యారాణికి ఇతర డైరెక్టర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 17నెలల్లో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందిస్తున్నామని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మన యువ నాయకులు నారా లోకేష్ సారధ్యంలో కేంద్రంలో నరేంద్ర మోడీ ఆశీస్సులతో మనం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మదనపల్లి టమాటో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారం చేయనున్న జంగాల శివరాంకి, వైస్ చైర్మన్ ఆంజనేయులు, మార్కెట్ యార్డ్ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.,మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష మాట్లాడుతూ రైతులకు కాపాడుకునే బాధ్యత మనందరిది రైతు రారాజు రైతు ఉంటేనే సమాజంలో మనమందరము రైతు వాళ్ళ కష్టపడి పంట తీసుకొని వస్తే మనం కూర్చొని తినగలుగుతున్నామని తెలిపారు. మదనపల్లి మార్కెట్ యార్డ్ మార్కెట్ యార్డ్‌కి ఒక మహర్దశ రాబోతున్నదిని మొన్న నేను కువైట్‌కి వెళ్ళాను కువైట్‌లో వెళ్లి దాదాపు పల్ప్ యూనిట్ ఒక రోజుకి మినిమం 50లోడ్లు పల్పు వాళ్లకి అవసరం ఉన్నదని ఒక పెద్ద కాంట్రాక్ట్ తీసుకొని రాబోతున్నామని తప్పకుండా రైతులకు ఒక మహర్దశ మారుతుందని అన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కూటం ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. ముందుగా వ్యవసాయ శాఖ సెక్రెటరీ జగదీష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి చైర్మన్‌గా జంగాల శివరాం, వైస్ చైర్మన్‌గా రామిశెట్టి ఆంజనేయులు, ఇతర సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు సాయి లోకేష్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, తెలుగుదేశం రాష్ట్ర యువత అధ్యక్షులు చినబాబు, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్, టౌన్ బ్యాంక్ చైర్మన్ విద్యాసాగర్, కదిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ చౌదరి, మండి యజమానులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటా

- నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త ఇంచార్జ్ రితీష్ రెడ్డి

విశాలాంధ్ర-బద్వేల్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో బద్వేల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. బద్వేల్ నియోజకవర్గం టీడీపీ కార్యకర్తలకు గురువారం చరిత్రాత్మక రోజుగా నిలిచింది. పార్టీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా అట్లూరు మండలం, పార్టీ అధ్యక్షుడిగా మల్లికార్జున రెడ్డి, బద్వేల్ మండలం రూరల్ పార్టీ అధ్యక్షులుగా రవికుమార్ రెడ్డి, గోపవరం మండలం, పార్టీ అధ్యక్షుడిగా సుధాకర్ రెడ్డి, బి కోడూరు మండలం పార్టీ అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి, పోరుమామిళ్ల మండలం పార్టీ అధ్యక్షుడిగా భైరవ ప్రసాద్, కలసపాడు మండలం పార్టీ అధ్యక్షుడిగా వెంకటరామిరెడ్డి, కాశి నాయనామండలం పార్టీ అధ్యక్షుడిగా రాజారెడ్డి, బద్వేల్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా వెంగల్ రెడ్డి టీడీపీ మండల పార్టీ అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావం ణంలో, ఘనంగా బద్వేల్ టిడిపి క్యాంపు కార్యాలయంలో జరిగింది. ముందుగా పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి టిడిపి జెండాను ఎగరవేశారు. నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త ఇంచార్జ్ యువ నాయకుడు రితిష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. బద్వేల్ రూరల్ మండల టీడీపీ సీనియర్ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇంచార్జీలు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రమాణ స్వీకార మహోత్సవం ప్రారంభం నుంచి చివరి వరకు పార్టీ నినాదాలతో కార్యాలయం ప్రాంగణం పసుపు పతాకాలతో కళకళలాడింది. నియోజకవర్గంలోని ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు వేదికపై ప్రమాణ స్వీకారం చేసి, పార్టీ పట్ల తమ విశ్వాసం, కట్టుబాటు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త ఇంచార్జ్ యువ నాయకుడు రితీష్ రెడ్డి మాట్లాడుతూ "టిడిపి కార్యకర్తలే పార్టీకి వెన్నెముక. మీరు గెలుస్తేనే పార్టీ గెలుస్తుంది. ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. నిబద్ధతతో, నిజాయితీతో పనిచేసే వారికి ఎల్లప్పుడూ నేను అండగా ఉంటా. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మన యువ నేత నారా లోకేష్ ఇచ్చిన బాధ్యతలను అందరం కలిసి నెరవేర్చుదాం" అన్నారు. పార్టీ శ్రేణుల్లో క్రమశిక్షణ, ప్రజల సమస్యలపై చురుకైన స్పందన, గ్రామస్థాయిలో బలమైన సంఘటనా నిర్మాణం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. టీడీపీ ఆవిర్భావం నుండి ఇప్పటివరకు ప్రజల మన్ననలు పొందిన పార్టీగా నిలవడానికి కారణం కార్యకర్తల కష్టమేనని అలాగే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల్లోకార్యకర్తలు సత్తా చాటే సమయం వచ్చిందని గుర్తుచేశారు. అనంతరం మాజీ తెలుగు దేశం పార్టీ అట్లూరు మండలం అధ్యక్షులు బోవిల్ల. అమర్నాథ్ రెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ రితీష్‌రెడ్డితో పాటు7 మండలాల పార్టీ అధ్యక్షులను నలుగురు డైరెక్టర్లను పూలమాలలతో దృశ్యాలు వాళ్ళతో ఘనంగా సత్కరించి పార్టీపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజక వర్గంలోని 7 మండలాల నుండి టిడిపి సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇంచార్జీలు, కో-క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇంచార్జీలు, కో-యూనిట్ ఇంచార్జీలు, టిడిపి కుటుంబ సభ్యులు భారీగా పాల్గొన్నారు.

గనుల నిర్వహణపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: జిల్లా ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న గనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మైనింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో జేసీ అదితి సింగ్ తో కలిసి.. జిల్లాలో మైనింగ్ క్వారీల నిర్వహణపై సంబంధిత మైన్స్ అధికారులతో జిల్లా కలెక్టర్ డి.ఆ శ్రీధర్ చెరుకూరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో అపారమైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని, వాటిని జిల్లా ఆర్థిక వనరుగా సద్వినియోగం చేసుకోవడంలో ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత మైనింగ్ అధికారులపై ఉందన్నారు. అందులో భాగంగా జిల్లాలోని గనుల నిర్వహణ పనితీరుపై సమీక్షించారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్ని గనులు నిర్వహణలో ఉన్నాయి..? నిర్వహణలో ఉన్న అన్ని క్వారీలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా..? నిబంధనలకు లోబడి నిర్వహణలో ఉన్నాయా..? అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పటిష్టున్నారా..? సామాజిక బాధ్యత, వార్షిక రాబడి, ఆదాయం తదితర అన్ని అంశాలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్.. మరిన్ని వివరాలు, పూర్తి సమాచారంతో.. తదుపరి సమావేశానికి హాజరవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య మైన్స్ డిడి సుబ్రమణ్యం, మైన్స్ విజిలెన్స్ ఇన్స్పెక్టర్ కృష్ణ మూర్తి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సుధ, రాయల్టీ ఇన్స్పెక్టర్లు తహశీల్దార్లు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు ఏపి ఎన్జిఓ ఎన్నిక ఏకగ్రీవం



విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు ఏపి ఎన్జిఓ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. కడప జిల్లా అధ్యక్షులుగా శ్రీనివాసులు, ప్రొద్దుటూరు ఎన్నికలు అధికారిగా యం.బాలపుల్లయ్య, సహాయ ఎన్నికల అధికారిగా పద్మనాభరావు, పరిశీలకులుగా నిత్య పూజయ్యను నియమించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి బాల పుల్లయ్య మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఏపీఎన్జిఓ అసోసియేషన్‌కు 18పోస్టులకు గాను ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు అయినందువల్ల మొత్తం సంఘసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నుకున్నట్లు తెలిపారు. కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, కార్యదర్శి నిత్య పూజయ్యలు పాల్గొన్ని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ మా రాష్ట్ర అధ్యక్షులు ఆలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివి రమణల ఆధ్వర్యంలో ఉద్యోగుల డిమాండ్స్, జీపీఎఫ్, ఏపీజీఎల్ ఐ, డిఏ, చైల్డ్ కేర్ లీవ్, పోలీస్ వారికి సరండర్ లీవ్, చాలా డిమాండ్స్ సాధించారని, త్వరలో పీఆర్సి, ఇతర డిమాండ్స్ తప్పకుండా సాధిస్తారని తెలియజేశారు. అధ్యక్షులుగా జె.రామసుబ్బయ్య, సహ అధ్యక్షులుగా జె.అశోక్ కుమార్, ఉపాధ్యక్షులుగా నాగరాజు, వరప్రసాద్, నాగార్జున, అన్వర్ హుస్సేన్, పీఏ సంధ్యారాణి (మహిళా)సెక్రటరీ ఈ.ప్రమీల ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభంజన్ రెడ్డి సంయుక్త కార్యదర్శులుగా మధుసూదన్ రెడ్డి, నారాయణ రాజు, సుబ్బారాయుడు, రెడ్డయ్య, సుజాత (మహిళ)కోశాధికారి, సదాశివయ్య, డిఈసి మెంబర్లు:సాదిక్ సాహెబ్, నరసింహులను ఏక గ్రీవముగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు కెజె రఘురామిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మైదుకూరు అధ్యక్షులు చంద్రమౌళి, కార్యదర్శి రాఘువ, పెన్షనర్ ల అధ్యక్షులు దస్తగిరి రెడ్డి, కార్యదర్శి వెంకటయ్య, అధ్యక్షులు రామసుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి కి, రాష్ట్ర ఉపాధ్యక్షునికి, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శికి ధన్యవాదాలు తెలిపారు.

నేటి నుంచి స్లాట్ బుకింగ్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: విభిన్న ప్రతిభావంతులకు నేటి నుంచి "స్లాట్ బుకింగ్" ప్రారంభం అవుతున్నట్లు ఆల్ ఆఫ్ యు దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ తెలిపారు. గురువారం నాడు మున్సిపల్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో అఫ్జల్ మాట్లాడుతు విభిన్న ప్రతిభావంతులు అయినటువంటి సోదర, సోదరీమణులు ఇంతవరకు సదరం పొందనటువంటి వారికి నేటి నుండి స్లాట్ బుకింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని, మీ పరిధిలోని సచివాలయంలో కాని, మీ సేవల యందు కాని స్లాట్ బుక్ చేసుకుని తదుపరి వారు ఇచ్చిన తేదీల యందు క్యాంపుకు పాల్గొని సదరం సర్టిఫికెట్ పొందగలరని తెలిపారు. ఎవరైనా తెలియనటువంటి వారు ఉంటే ఈ విషయాన్ని అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులకు తెలియజేసి వారికి సదరం అందే విధంగా సహాయ సహకారాలు అందించగలరని అన్నారు.

టిడిపి మండల అధ్యక్షుని ఎంపిక

విశాలాంధ్ర-కొండాపురం: తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులుగా గండ్లూరు గ్రామానికి చెందిన పి. నాగేశ్వరరెడ్డి పార్టీ ఎంపిక చేయడంతో పార్టీ నిర్ణయం మేరకు గురువారం జమ్మలమడుగులోని పార్టీ కార్యాలయం నందు పార్టీ అధ్యక్షులుగా ప్రమాణం స్వీకారం చేశారు. అలాగే మండల ఉపాధ్యక్షులుగా పూటకాల నాగశేఖర్, మండల జనరల్ సెక్రటరీగా కె. హరిచంద్ర రెడ్డి, మండల కార్యదర్శిగా జి. శ్రీనివాసులు, కొండాపురం క్లస్టర్ ఇంచార్జ్ గా గోరుశెట్టి బాబు, ఐ టీడీపీ మండల ఉపాధ్యక్షులుగా అనిశెట్టి. హరి కృష్ణ, యూనిట్ ఇంచార్జ్ గా సురేష్, బూత్ ఇంచార్జ్ లుగా వీర శేఖర్ తదితరులను మండల కమిటీలో నియమించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీ మండల అధ్యక్షులుగా రెండవ సారి అవకాశం కల్పించినందుకు పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ కు నా ఎన్నికకు సహకరించిన నియోజకవర్గం ఇంచార్జ్ భూపేష్ రెడ్డి, మండల ఇంచార్జ్ శివనారాయణ రెడ్డిలు పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదములు తెలియచేసారు. అలాగే పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నిరాశ్రయులకు అండగా మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ మరియు ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలీసులు ఫోన్ ద్వారా "మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్" చైర్మన్ మోరే లక్ష్మణరావు గారిని సంప్రదించుగా, ఆయన వెంటనే స్పందించి నిరాశ్రయుల అంత్యక్రియలు నిర్వహించే ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం ప్రొద్దుటూరు స్మశాన వాటికలో హిందూ సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలకు చేయూతనందిస్తుండటంపై ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావుకు, అశోక్, కృప, ఆగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు కిరణ్, ప్రసన్న, సురేష్, మైకేల్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. జీవితానికి విలువ ఇస్తే అది మనసు మరొకరి జీవితానికి విలువ ఇస్తే అది సేవ అని అన్నారు.మా శ్రీ అమ్మ శరణాలయంలోని వృద్ధులకు సహాయం చేయదలచిన దాతలు 82972 53484, 91822 44150 అనే నెంబర్ లకు సంప్రదించాలని అన్నారు.

రాచమల్లు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మునిసిపల్ ఎగ్జిబిషన్ కు సంబంధించి తెలుగుదేశం పార్టీకి చెందిన గుత్తేదారుడు సుమారు 1కోటి రూపాయలు ఎగవేసిన నేపథ్యంలో, తిరిగి ఆ డబ్బును మునిసిపల్ ఖజానాకు చెల్లించే వరకు చేస్తున్న దీక్షల్లో భాగంగా గురువారం వై.యస్.ఆర్.సి.పి 1వ వార్డుకు చెందిన రాజేష్, ఓబులేసు, చందు, అంజన్, సుందరయ్య కాలనీ గంగాధర్, సుబ్బారావుల ఆధ్వర్యంలో 8వ రోజు మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ దీక్షకు వై.యస్.ఆర్.సి.పి కి చెందిన 1వ వార్డు కౌన్సిలర్ పందిటి సరోజమ్మ, బొల్లవరం వెంకటేశ్వర ఆలయం మాజీ ఛైర్మెన్ గోన ప్రభాకర్, యత్తపు శ్రీకాంత్, జంగమ్మయ్య యాదవ్ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ దీక్షకు సంఘీభావం తెలిపారు.

యూరియా అందుబాటులో ఉంది

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : యూరియా అందుబాటులో ఉందని ప్రతి రైతు రబీ సీజన్లో ఉపయోగించుకోవచ్చు అని మండల టిడిపి అధ్యక్షుడు యన మల మదన మోహన్ పేర్కొన్నారు. గురువారం దప్పేపల్లి రైతు సేవ కేంద్రంలో యూరియా, ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది వర్షాలు తక్కువ కావడంతో రబీ సీజన్‌కు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవతో వెలుగల్లు ప్రాజెక్టు నుంచి మండలంలోని అన్ని చెరువులకు నీరు వచ్చాయని ప్రతి చెరువు నిండుకుండలా ఉందని రైతులు పంటలు విస్తారంగా సాగు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోనంపేట, దప్పేపల్లి, సర్పంచులు కేశవులు, లక్ష్మీనారాయణ, రైతు సేవా సిబ్బంది కృష్ణమోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు గోవింద్, వెంకటేష్, చిన్న గంగయ్య, కావలి ఆంజనేయులు, ఆనంద రెడ్డి, ఓబులేష్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు:ఎమ్మెల్యే

విశాలాంధ్ర -రైల్వేకోడూరు: సమాజంలో ప్రజల ఆరోగ్య విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ వైకోట జనసేనపార్టీ నాయకులకు హామీ ఇచ్చారు.అత్యంత ప్రమాదకర గడ్డి మందు వినియోగ ప్రభావం ఆత్మహత్యలకు దారి తీస్తుందని తక్షణం గడ్డి మందుపై పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని గురువారం వైకోట జనసేన పార్టీ నాయకులు నల్లంశెట్టి కిషోర్, అలం నాగభూషణం, కేతంశెట్టి సుబ్రమణ్యం,హరి తదితరులు ముక్కావారిపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యేకి వినతిపత్రం సమర్పించారు. ప్రమాదకర గడ్డి మందు వలన భూములు కాలుష్యానికి గురౌతున్నాయన్నారు. గడ్డి మందుతో చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడిన వ్యక్తుల కుటుంబాలు మానసికంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయి వివరించారు. శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. గడ్డి మందు ప్రభావంపై సంబందిత అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రమాదకరమైన గడ్డి మందు నివారణపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మిట్స్‌లో ఎంట్రప్రెన్యూర్షిప్ పై అవగాహన

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లి సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ నందు స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ విభాగం వారు మరియు కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సూక్ష్మ, చిన్న %do% మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారి సహకారంతో ఎంట్రప్రెన్యూర్షిప్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్, డిప్యూటీ మేనేజర్ పి.అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి వేగవంతమైన సాంకేతిక మరియు ఆర్థిక ప్రపంచంలో, ఉద్యోగాల కోసం ఎదురుచూడటం కంటే స్వయంగా ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యం అత్యంత అవసరం అని అన్నారు. అదే విధంగా మనం తయారు చేసిన వస్తువుకు, మిగతా వాటికీ ఉన్న తేడా కూడా పరిశ్రమ విజయానికి దోహదపడుతుంది అని తెలిపారు. ఏ వ్యాపారం అయిన లాభాల బాటలో ముందుకు వెళ్ళాలి అంటే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో మన వస్తువు ధర, నాణ్యత ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డీన్ స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ డాక్టర్ భాను శ్రీ రెడ్డి, కో-ఆర్డినేటర్ డాక్టర్ గీత దేవి, ఈడి సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె. శిరీష, కో-కోర్డినేటర్ డాక్టర్ జగన్ నాథ్, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడకం వల్ల జీవితాలు నాశనం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : డ్రగ్స్ వాడడం వల్ల జీవితాలు నాశనం అవుతాయని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వరాల రమేష్ పేర్కొన్నారు. నేషనల్ సర్వీస్ స్కీమ్‌లో భాగంగా ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులచే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో చౌటపల్లిను దత్తతకు తీసుకున్నారు. ఈ సందర్భంగా చౌటపల్లిలో మానవహారం నిర్వహించి ప్రతి ఇంటికి తిరిగి యాంటీ డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

దళితవాడకు కనీస సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లి మండలం బి.ఎర్రగుడి గ్రామ పరిధిలోని హరిజనవాడకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్ది గాళ్ళ శ్రీనివాసులు సిపిఐ మండల కార్యదర్శి కొమ్ము ఓబులేష్ అన్నారు. గురువారం దళితవాడలోనే దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన దళితుల బ్రతుకులు మాత్రం మారలే దన్నారు. రాయచోటి నియోజకవర్గంలో ఉన్న దళితవాడలు ఏ ఒక్కటి కూడా అభివృద్ధి చెందలేదని నేటికీ దళితులు చనిపోతే పూడ్చుకోవడానికి స్మశానవాటికలు సాగుభూ ములు, దారి సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ వీధి దీపాలు పక్కా గృహాలు నివాసాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఉన్నతాధికారులు నెలలో ఒక్క రోజైన దళితవాడను సందర్శించి వాళ్ళ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని దళిత వాడలను కలిపి చలో అన్నమయ్య కలెక్టరేట్కు పిలుపునిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రవి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్ఎంపీ ల విధి, విధానాలపై సమావేశం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని అర్ఎంపీలకు వారి విధి, విధానాల గురించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి సాయి శ్రీ మాట్లాడుతూ అర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని, డాక్టర్ అని వ్రాసుకోకూడదని, క్లినిక్ మరియు ఆసుపత్రి అని వాయకూడదని, కేవలం ప్రథమ చికిత్స కేంద్రం అని బోర్డు పెట్టుకోవాలని, వ్యాధులు రాకుండా సలహాలు, సూచనలు ఇచ్చి చికిత్సకు వెళ్ళవలసిన ఆసుపత్రి సూచించి ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం చికిత్స చెయ్యాలని ఎవ్వరైనా నిబంధనలకు వ్యతిరేకంగా చికిత్స చేసిన యెడల కఠిన చర్యలు తీసుకొంటామని తెలిపారు. అలాగే ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. గీత మాట్లాడుతూ ప్రథమ చికిత్స కేంద్రంలో మంచాలు, ఐవి స్టాండ్స్ ఉండరాదని, గర్భవతులకు ఎలాంటి పరీక్షలు, ప్రసవాలు, అబార్షన్లు చేయకూడదని, శిశువులు మరియు చిన్న పిల్లలకు ఎలాంటి వైద్య సేవలు అందించకూడదన్నారు. డెమో భారతి మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్ సదా శివయ్య మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలకు ప్రోత్సహించి స్కానింగ్ లు చేపించిన యెడల వారి మీద కఠిన చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఈ కార్యక్రమం లో వైద్యాధికారి డా.నజీర్, వెంగలరెడ్డి, సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న టిడిపి నేత కానాల మల్లికార్జునరెడ్డి

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని రేకలకుంట గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన వివాహానికి ఆర్థిక సాయాన్ని తెదేపా యువ నేత కానాల మల్లి కార్జునరెడ్డి అందజేశారు. రేకలకుంటలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించి ఆయన చిన్న వయసు నుండే అంచెలంచెలుగా పారిశ్రామికవేత్తగా ఎదిగి, టిడిపి పార్టీ నుండి రాజకీయ ఆరంగేట్రం చేసిన యువ నాయకుడు కానాల మల్లికార్జున రెడ్డి మరోసారి తన దాతృత్వం చాటుకున్నారు. బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీ రేకలకుంట గ్రామంలో నివాసముంటున్న ఎస్టీ కాలనీకి చెందిన సుబ్బయ్య అకాల మరణం చెందడం జరిగింది. కుటుంబ పెద్ద మరణించడంతో వారి కుటుంబ పరిస్థితి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని విషయం తెలుసుకున్న టిడిపి మండల యువ నాయకులు కానాల మల్లికార్జునరెడ్డి అకాల మరణం చెందిన సుబ్బయ్య కుమార్తె వివాహానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని తన అనుచరుల చేత అందించారు. అంతేకాకుండా వారి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు పుటాల శివ యాదవ్, గుజ్జు రామాంజనేయులు, ఓబయ్య, బ్రహ్మానాయుడు, గంగన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

18న కులగణన జరపాలని నిరసన :సిపిఐ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: నవంబర్ 18న కులగణన జరపాలని నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. గురువారం నాడు స్థానిక పెన్నా నగర్ లోని సిపిఐ కార్యాలయంలో శ్రీనివాసుల రెడ్డి అధ్యక్షతన సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గాలి చంద్ర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనగణన పేరుతో మమ అనిపిస్తూ కులగణన జరపకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆర్థిక స్థితి గతులపై నివేదికలు ప్రభుత్వం జరపకుండా పాలనలో సమ న్యాయం ఎలా చేస్తారన్నారు. ఈ సమావేశాలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, సిపిఐ కడప జిల్లా ఇన్చార్జ్ హరినాథ్ రెడ్డిలు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, పట్టణ ఇన్చార్జ్ బి.రామయ్య, పట్టణ కార్యదర్శి పి.సుబ్బారాయుడు, సమితి సభ్యులు రామకృష్ణ, వై.హరి, మద్దిలేటి, చంద్రశేఖర్, గోవిందరెడ్డి, పీటర్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

మదర్ ఇండియా మహా పుత్రుడు జవహర్‌లాల్ నెహ్రూ: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: నవభారత నిర్మాత, భారతరత్న, దేశ తొలి ప్రధాని స్వర్గీయ పండిట్ జవహర్లాల్ నెహ్రూ కారణజన్ముడు ,మదర్ ఇండియా మహా పు త్రుడని రాజ్యసభ మాజీ సభ్యులు ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కీర్తించారు. గురువారం గుంటూరులో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ రెడ్డి ఆధ్వర్యంలో దేశ ప్రగతిలో నెహ్రూజీ పాత్ర అనే అంశంపై నిర్వహించిన చర్చా గోష్ఠి లో తులసిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రగతికి పండిట్ నెహ్రూ బలమైన పునాది వేశారని ,ఆ పునాది పైనే తర్వాత వచ్చిన ప్రభుత్వాలు నవభారత నిర్మాణాన్ని చేపట్టాయని అన్నారు. డాక్రానంగల్ ,హిరాకుడ్ ,నాగార్జునసాగర్ ,తుంగభద్ర డాం తదితర సాగునీటి ప్రాజె క్టులు నిర్మించి దేశంలో ఆహార ధాన్యాల కొరతను తీర్చారన్నారు. కార్యక్రమంలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ రెడ్డి,మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ,జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు లక్ష్మణరావు ,ప్రొఫెసర్ రంగయ్య ,ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం ఇతరులు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాల ఉత్తమ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ స్వర్ణలత

విశాలాంధ్ర-రాజంపేట: స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపల్‌గా సేవలు అందస్తున్న డాక్టర్ డి.స్వర్ణలతకి జేఎన్టీయూ విశ్వవిద్యాలయం అనంత పురం వారు ప్రతిభను, సేవలను తన పదవిలో చేపట్టినందుకు బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డు అందజేశారని కళాశాల వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డు యూని వర్సిటీ అప్రిసియేషన్ అవార్డ్స్ - 2025 లో భాగంగా జెఎన్టియు విశ్వవి ద్యాలయం వారి బృందం వైస్ ఛాన్సర్ ప్రూఫ్. హెచ్. సుదర్శన రావు, రిజిస్టర్ ప్రూఫ్ కృష్ణయ్య, ప్రూఫ్ ఎస్వి. సత్యనారాయణలతోపాటు ఇతర విశ్వవిద్యాలయ డైరెక్టర్లు ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలతకు అవార్డును అందజేశారు. అవార్డు గ్రహీతలైన డాక్టర్ స్వర్ణలతని అన్నమాచార్య విశ్వవి ద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ సాయిబాబా రెడ్డి, ఇతర అడ్మినిస్ట్రేటివ్ బృందం వారు అభినందించారు. అన్న మాచార్య యూనివర్సిటీ యాజమాన్యం కార్యదర్శి డాక్టర్ గంగిరెడ్డి, కోశాధికారి అభిషేక్ రెడ్డి, చైర్మన్ డాక్టర్ రామచంద్ర రెడ్డిలు ప్రిన్సిపాల్‌ని అభినందించారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు భవిష్యత్తుకు చేటు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: ప్లాస్టిక్ వర్గాలు మానవాళి భవిష్యత్తుకు చేటని ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం గ్రామాల్లో పచ్చదనం పరి శుభ్రతపై పంచాయతీ కార్యదర్శు లు సర్పంచులు ఉప సర్పంచ్లకు శిక్షణ కార్యక్రమం స్త్రీశక్తి భవన్లో జరిగింది. ఆయన మాట్లాడుతూ వ్యర్థ పదార్థాలను గ్రామాలలో ఇంటి వద్దనే వేరువేరుగా అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ తో కలిగే అనర్థాలను వివరించి వాటికి దూరంగా ఉండేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యా మ్నాయ వస్తువులను వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో గ్రామాల్లో స్వచ్ఛతే ప్రదానంగా ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. శుక్రవారం డ్వాక్రా సంఘాల మహిళలు, రిసోర్స్ పర్సన్ లకు ఇదే అంశంపై శిక్షణ ఉంటుందన్నారు. శిక్షకులు ఆర్ సి ఓబులేసు, సురేంద్ర పలు అంశాలను వివరించారు కార్యక్రమంలో సర్పంచులు చిత్త రవి ప్రకాష్ రెడ్డి యనమల సుధాకర్, కల్లూరు రమణారెడ్డి లతోపాటు పలువురు పాల్గొన్నారు.

కేబుల్ దొంగలు అరెస్టు

విశాలాంధ్ర-పులివెందుల: రైతుల పంట పొలాల్లో కేబుల్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు పట్టుకున్నట్లు పులివెందుల డీఎస్పీ మురళినాయక్ తెలిపారు. గురువారం ఆయన పులివెందుల డీఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ లింగాల మండలంలోని మురారిచింతల క్రాస్ సమీపంలో నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు, ఆటోలో మోటార్ కేబుల్ తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారన్నారు. విచారణలో వారు ప్రొద్దుటూరుకు చెందిన జమ్మయ్య, అతని కుమారుడు నాగరాజు అని గుర్తించారు. వీరి వద్ద నుండి సుమారు 2వేల మీటర్ల మోటార్ కేబుల్, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారన్నారు. “ఈ దొంగలు ముందుగా గ్రామాల్లో, పంట పొలాల వద్ద రెక్కీ నిర్వహించి, రైతులు లేని సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని, రైతులు అపరిచిత వ్యక్తులు పొలాల వద్ద కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి” అని డీఎస్పీ సూచించారు. సింహాద్రిపురం, తొండూరు, పులివెందుల, లింగాల మండలాల పరిధిలో ఇటీవల కేబుల్ దొంగతనాలు పెరిగాయని తెలిపారు. ప్రస్తుతం సుమారు 50 వేల విలువైన కేబుల్ వైర్లు స్వాధీనం అయ్యాయని, త్వరలోనే వాటిని రైతులకు తిరిగి అప్పగిస్తామని ఆయన చెప్పారు. అంతేకాకుండా “గతంలో పులివెందుల పరిధిలో 12 ఇళ్లలో చోరీలకు పాల్పడిన ఆరుగురు దొంగలను కూడా అరెస్టు చేసి, ఆస్తులను రికవరీ చేశామని, తాడిపత్రిలో కూడా నలుగురు కేబుల్ దొంగలను పట్టుకున్నాం” అని వివరించారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన రూరల్ సీఐ ఎన్.వెంకట రమణ, లింగాల ఎస్ఐ అనిల్ కుమార్‌లను డీఎస్పీ అభినందించారు.

పంటలకు డ్రిప్ పరికరాలను అమర్చుకోవాలి: ఎపిడి

విశాలాంధ్ర-వేంపల్లి: ఉద్యాన పంటలకు రైతులు డ్రిప్ పరికరాలను అమర్చుకొంటే నీటి ఆదా కావడంతో పాటు ఆదాయం కూడ బాగా వస్తుందని ఎపిడి మురళి మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాములూరు గ్రామంలో సాగు చేసిన పండ్ల తోటలను సూక్ష్మ నీటి సాగు పథకం ఎపిడి మురళి మోహన్ రెడ్డి పరిశీలించారు. అలాగే రైతులకు డ్రిప్ పరికరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్ పరికరాలను రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు డ్రిప్ పరికరాలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. 5 ఎకరాల లోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందజేయడం జరుగుతుందని చెప్పారు. 10 ఎకరాల లోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసి, ఒసిలకు చెందిన రైతులకు 90 శాతం సబ్సిడీ, 10 ఎకరాలు పైన ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసి, ఒసి రైతులకు 50 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలాగే అన్ని వర్గాల రైతులకు స్పింకర్లు 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలిపారు. డ్రిప్ సిస్టమ్ ద్వారా ఎరువులు కూడ సమర్థవంతంగా వినియోగించవచ్చు అన్నారు. రైతులకు ఎరువుల ఖర్చు కూడ తగ్గుతుందని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్ అమలు చేయడం వలన సాగు ఖర్చు 40 శాతం అదా చేయవచ్చు అన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులకు డ్రిప్, స్పింకర్లు అందిస్తున్నట్లు చెప్పారు. కాబట్టి ప్రతి రైతు ఆయా పంటలకు డ్రిప్ పరికరాలతో వ్యవసాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోటి సంతకాలతో ప్రైవేటీకరణను అడ్డుకుందాం: ధ్వజారెడ్డి

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: ప్రయివేటీకరణతో పేద విద్యార్థులు వైద విద్యకు దూరమవ్వడమే కాకుండా పేదలకు ప్రభుత్వ వైద్యం దూరమౌతుందని మండల అధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. గురువారం రెడ్డివారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్ నందు సిరిగిరి రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ధ్వజారెడ్డి మాట్లాడుతూ పార్టీ మాత్రమే కాకుండా పౌరసమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న మేధావి వర్గాలు ప్రజాసంఘాలు వివిధ రాజకీయ పార్టీలు సంతకాల సేకరణలో పాల్గొనాలని కోరారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాలని కోరారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైసిపి సైన్యం పటిష్టంగా ఉంది చెక్కు చెదరలేదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సిహెచ్ రమేష్ బాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుబ్బరామరాజు, సర్పంచులు హరికృష్ణారెడ్డి, ఆర్వీ రమణ, ఎంపిటిసిలు మహేశ్వర్ రెడ్డి, బండారు మల్లిఖార్జున, బిసి నాయకులు ఇనమాల మహేష్,ట్రేడ్ యూనియన్ నాయకులు కొప్పల శంకరయ్య,భూంపల్లి నాగరాజు, సింగమాల రాజగోపాల్, షఫీ, గాంధీనగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రమోహన్ రెడ్డిని సన్మానించిన జియావుద్దీన్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ఆంధ్ర ప్రదేశ్ లేబర్ వెల్ఫేర్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన లోమడ చంద్రమో హన్ రెడ్డిని వారి స్వగృహంలో. సన్మానించారు. 30వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ జీయావుద్దీన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను గురుపెట్టుకుంటుందని వారికి పార్టీలో కీలక బాధ్యతలు అందిస్తోందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో ఎంతో కష్టపడి పార్టీ కోసం పనిచేసిన నాయకుడు లోమాడ చంద్రమోహన్ రెడ్డి కష్టపడి పని చేశారని తెలిపారు. కడపలో ఎమ్మెల్యే ఎలక్షన్‌కు తనదైన శైలిలో పనిచేసే పార్టీ విజయానికి దోహదపడ్డ నాయకుడు లోమడ చంద్రమోహన్ రెడ్డి అన్నారు. మిత్రులతో కలిసి అభినందనలు తెలిపాము.

ముస్లింల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ఇమామ్ మౌజ్జన్ లకు 12 నెలల గౌరవ వేతనం విడుదల చెయ్యటం పట్ల తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మరియు కడప 30 వ డివిజన్ ఇంచార్జ్ షేక్ జియాఉద్దీన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జియావుద్దీన్ మాట్లాడుతూ భారతదేశంలోనే మొట్టమొదటిసారి ఇమామ్ మౌజ్జన్ లకు గౌరవ వేతనాలు ఇచ్చిన ఘనత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దే అని కొనియాడారు. 90కోట్ల రూపాయలు ఐదువేల మసీదులకు కేటాయించడం పట్ల ప్రతి ఒక్క ఇమామ్ మౌజ్జన్ ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. కొంత మంది ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో బిజెపి ఉన్నందున ముస్లింలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయరన్న కుట్ర పూరిత ప్రచారానికి ఇది చెంప పెట్టు లాంటిదని జియావుద్దీన్ అన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ప్రజా వైద్యాధికారి సౌదాగిరి రమేష్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఎటువంటి అంటూ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజా వైద్యాధికారి సౌదాగిరి రమేష్ తెలిపారు. గురువారం నగర పర్యటనలో భాగంగా మేకల దొడ్డి వద్ద ఉన్న జంతు వదశాల పరిశీలించారు. ఈ సందర్భంగా జంతువులను వధించిన తర్వాత వ్యర్థాలను ఎప్పటికప్పుడు ఒక్క చోట వేసి కార్పొరేషన్ శానిటరీ వర్కర్లు, చంద్ర సేకరించే వాహనాలకు అందించాలని ఆదేశించారు. ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతూ రోగాల బారిన పడేందుకు అవకాశం ఉందన్నారు. అలానే ఏడురడ్ల సర్కిల్ వద్ద పనిచేస్తున్న శానిటరీ వర్కర్స్ తో మాట్లాడుతూ పరిశుభ్రంగా ఉంచేందుకు మీ వంతు కృషి అందించాలనీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సానిటరీ ఇన్స్పెక్టర్లు శానిటరీ సెక్రటరీలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాదెళ్ల మనోహర్‌ని కలిసిన అతికారి కృష్ణ

విశాలాంధ్ర-రాజంపేట: మదనపల్లె అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనటానికి విచ్చేసిన మంత్రి నాదేండ్ల మనోహర్‌ని మదనపల్లిలో మర్యాద పూర్వకంగా కలిసిన రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ సమన్వయ కర్త అతికారి కృష్ణ. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రదాన కార్యదర్శి జంగాల శివరామ్ గురువారం మదనపల్లె అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం సందర్భంగా వారి ఆహ్వానం మేరకు జనసేన నేత ప్రజానాయకుడు అతికారి కృష్ణ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, జనసేన శ్రేణులు, కూటమి శ్రేణులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

15న జాబ్‌మేళా

విశాలాంధ్ర-పోరుమామిళ్లరూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ వారి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతి యువకులకు ఉపాది కల్పనలో భాగంగా ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి విజయ్ వినీల్‌కుమార్ గారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళా 15న ఉదయం 9గంటలకు శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజ్, పోరుమామిళ్ళలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 7013504977, నెంబర్‌కు సంప్రదించగలరు.

కళ్యాణోత్సవంలో పాల్గొన్న టిడిపి నాయకులు

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి: లక్కిరెడ్డిపల్లి మండలం కస్తూరి కస్తూరి రాజు గారి పల్లి గ్రామ పంచాయతీ దేవలంపల్లిలో వెలిసినటువంటి శ్రీశ్రీశ్రీ చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవంలో రాయచోటి తెలుగు దేశం పార్టీ యువ నాయకుడు లక్ష్మి ప్రసాద్ రెడ్డి గారు మరియు లక్కిరెడ్డిపల్లి మండల ఇంచార్జ్ యనుమల మదన్ మోహన్ పాల్గొన్నారు. వేద పండితులు పూర్ణకుంభలతో వేదమంత్రాలూ తో స్వాగతం పలికి స్వామి వారి దర్శనతారం తీర్థ ప్రసాదాలు అందించారు. మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి గారు మాట్లాడుతూ చెన్నకేశవ స్వామివారి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా పడి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని దేవుడి ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలపై ఉండి ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని తెలిపారు. అష్ట ఐశ్వర్యాలతోఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జ్ యనుమల మదన్ మోహన్ తో పాటు పాపయ్య, సిద్దక వెంకట్రాంరెడ్డి, జనార్దన్ రెడ్డి, దేవానంద రెడ్డి, మండ్ల రామాంజనేయులు, యోగంజనేయులు గ్రామ ప్రజలు, భక్తులు పాల్గున్నారు.

నాగిశెట్టిపల్లెలో పందుల బీభత్సం

- రాత్రిళ్లు గట్టిగా అరుస్తూ ఇళ్లలోకి చొరబడుతున్న పందులు - అధికారుల నిర్లక్ష్యం - సమస్య దళితుల కాలనీలో అయినందుకెనా?

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలోని నాగిశెట్టిపల్లె పంచాయతీ ప్రజలు ఏడాది కాలంగా పందుల బెడదతో అలమటిస్తున్నారు. ఎన్.గొల్లపల్లె, నందిపల్లె సెంటర్, సహాయ నగర్ ప్రాంతాల్లో పందులు గుంపులుగా తిరుగుతూ ప్రజల జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. పందులు రాత్రి వేళల్లో గట్టిగా అరుస్తూ భయాందోళనలు సృష్టించడం, ఇళ్లలోకి చొరబడి గిన్నెలు, బకెట్లు పడగొట్టడం, ఆహారపదార్థాలను నాశనం చేయడం, ఇంటి ఆవరణలో చెత్తచెదారం చెలరేగిపోవడం వంటి సంఘటనలు వరుసగా జరుగుతున్నాయని గ్రామస్తులు కన్నీటి గళంతో వాపోతున్నారు. "పిల్లలు బయటకు రావడానికి భయపడుతున్నారు. తలుపులు మూసుకుని కూర్చున్నా పందులు తలుపులు తొక్కుతుంటాయి. మాకు బతకడం కష్టమైపోయింది" అని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాది కాలంగా సమస్యను పంచాయతీ సెక్రటరీ, మండల ఎంపీడీవో దృష్టికి

తీసుకెళ్లినా, "ఈరోజు చేస్తాం, రేపు చేస్తాం" అన్న సమాధానం తప్ప పరిష్కారం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రత్యేకంగా షెడ్యూల్ కాస్ట్ వర్గాల కాలనీల్లో పందుల పెంపకం అధికంగా ఉండటం, యజమానులకు కొంతమంది ప్రభావశీలుల మద్దతు ఉండడం వల్ల సమస్యను నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇక గ్రామస్థులు పందుల యజమానులను సూటిగా అడిగితే మాత్రం, "గ్రామంలో కోళ్లు, ఉంటాయి, మేకలు, కుక్కలు బర్రెలు ఉంటాయి. వాటివల్ల మీకు నష్టం ఏమీ లేదు. పందుల వల్లే ఎందుకు సమస్య వస్తోంది?" ముందు వాటిని తొలగించండి తరువాత పందుల గురించి ఆలోచిస్తాం అంటూ ఎదురుదాడికి దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సమస్య మరింత ముదిరిపోతోందని గ్రామస్థులు చెబుతున్నారు.."ప్రజల సమస్యలను 'మాకు సంబంధం లేదు' అంటూ పక్కకు తప్పుకోవడం నాయకులకు, అధికారులకు తగదు. పందుల బెడదతో మేము బతకలేని స్థితి వచ్చింది. తక్షణమే చర్యలు తీసుకోవాలి" అని గ్రామంలోని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నాగిశెట్టిపల్లె ప్రజల ఈ విన్నపం ఒక ఆవేదన మాత్రమే కాదు అది గ్రామంలో ప్రజా పరిపాలన లోపాలను బహిర్గతం చేస్తున్న నిదర్శనం. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపకపోతే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశముందని గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

19న అంతర కళాశాలల బాడ్మింటన్ పోటీలు

విశాలాంధ్ర-కడప వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన అంతర కళాశాలల బాడ్మింటన్ (పురుషులు, మహిళల) సింగిల్స్, డబుల్స్ విభాగాలలో పోటీలు బద్వేలు బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి తెలిపారు.ఆసక్తి కలిగిన క్రీడాకారులు విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థలలో చదవి ఉండాలన్నారు. తమవెంట జరిజినల్ స్టడీ సర్టిఫికేట్ తో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలపై అటెస్ట్ చేయించి తీసుకురావాలన్నారు. క్రీడాకారుల వయోపరిమితి 17 సం౹౹ పైబడి 25ఏళ్ల లోపు ఉండవలన్నారు. వివరాలకు 9705459052 నంబర్ ను సంప్రదించాలని సూచించారు.

గ్రామకంఠం భూములకు ప్రాపర్టీ కార్డులు: ఎంపిడిఓ

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: మండలం పంచాయతీలోని గ్రామకంఠం భూములకు ప్రభుత్వంచే ప్రాపర్టీ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందని ఎంపిడిఓ ఆర్ నాగిరెడ్డి, డిప్యూటీ ఎంపిడిఓ హరితమ్మ పేర్కొన్నారు. ప్రభుత్వ అదేశాల మేరకు గురువారం వివి ఖండ్రిక గ్రామంలో సర్పంచ్ శ్రీరాం అధ్యక్షతన జరిగిన స్వామిత్ర స్పెషల్ గ్రామ సభలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ఎవరి అధీనంలో ఉంటే వారికి నోటీసులు జారీ చేసి అభ్యంతరాలు లేకుంటే సర్వే చేసి హద్దులు ఏర్పరిచి తరువాత ప్రభుత్వంచే ప్రాపర్టీ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మొదటి ఫేస్ కింద బుడుగుంటపల్లి, ఓబనపల్లి, శెట్టిగుంట, మాధవరం పోడు, వివి ఖండ్రిక మొత్తం 5గ్రామ పంచాయతీలను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు.ఇప్పటి వరకు బుడుగుంటపల్లి, వివి ఖండ్రిక గ్రామ పంచాయతీలలో స్వామిత్ర స్పెషల్ గ్రామ సభలు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన గ్రామ పంచాయతీలలో కూడ గ్రామ సభలు జరుగుతాయన్నారు. మిగిలిన గ్రామ పంచాయతీలలో ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రెండవ ఫేస్ కింద గ్రామ సభలు జరుగుతాయన్నారు. గ్రామస్తులు అధికారులకు సహకరించాలని కోరారు.ఈ గ్రామ సభలో పంచాయితీ సెక్రటరీ గంగాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సుండుపల్లెలో ఉచిత పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర-సుండుపల్లె: మండల పరిధిలోని తిమ్మసముద్రం పంచాయతీ, బింగివాండ్లపల్లిలో ఎపిఎల్‌డిఎ కడప వారి ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు.జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా గుణశేఖర్ పిళ్ళై ప్రారంభించి రైతు సోదరులకు ఉపాధి హామీ పథకం కింద ఉచిత పశుగ్రాసం పెంపకం గురించి వివరించారు.రాయచోటి ఉప సంచాలకులు డాక్టర్ మాల కొండయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో పాడి పశువుల సంరక్షణను వివరించారు. విజయకుమార్ సహాయ సంచాలకులు సుండుపల్లి వారు దూడలలో నట్టల నివారణ ఆవశ్యకతను వివరించారు.సుధాకర్ పేయ దూడలు పుట్టే ఎద సూదుల ప్రాముఖ్యతను తెలిపారు. చాంద్ భాషా గర్భకోస వ్యాధులను పరీక్షించారు. 42 గర్భకోశ వ్యాధులు, చూలు పరీక్షలు, 22 దూడలకు నట్టల నివారణ మందులు, 8 సాధారణ చికిత్సలు అందించారు.అలాగే రైతులకు 1కెజి మినరల్ మిక్చర్, 1 మినరల్ బ్లాక్ అందించడం జరిగింది.బింగివాండ్లపల్లిలో పశు వైద్య శిబిరం నిర్వహించడం పట్ల రైతులు హర్షం వెక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ రవికుమార్, వీరబల్లి డాక్టర్ గణేష్,అంబులెన్స్ డాక్టర్ గణేష్,రమణ, గోపాల మిత్రులు,స్థానిక పశు సంవర్ధక శాఖ సహాయకురాలు అర్చన పాల్గొన్నారు.

18న సిపిఐ ఆందోళనలు విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-పీలేరు: సామాజిక న్యాయం- ఆత్మగౌరవం కోసం దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులను ఖండిస్తూ, జనగణనలో కులగణన చేపట్టాలని కోరుతూ నవంబర్ 18న సిపిఐ ఆందోళనలు విజయవంతం చేద్దామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ తెలిపారు. గురువారం కలకడ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీపీఐ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి చేపట్టిన తదుపరి గత 11ఏళ్ల కాలంలో దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలపై దాదులు మితిమీరిపోతున్నాయి. దేశంలో మతోన్మాద పాలన సాగుతోంది. అణిచివేత, అంటరానితనం, కుల, మత వివక్షత, హింస పేట్రేగిపోతున్నాయి. అర్‌ఎస్‌ఎస్, సంఘపరివార్ కనుసన్నలలో భారత రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగిస్తున్నారన్నారు. పలు అంశాలపై ఈ నెల 18న నిర్వహిస్తున్న ఆందోళనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ పీలేరు నియోజకవర్గ సహయ కార్యదర్శి నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు ముభారక్, డప్పు కలాకారుల సంఘం నాయకులు శ్రీనివాసులు, మహబూబ్ వలీ, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు అవసరం

విశాలాంధ్ర-సిద్దవటం: ఉద్యాన శాఖ అధికారి జయభారత్ రెడ్డి ఆధ్వర్యంలో సిద్దవటం మండలం లోని జ్యోతి, వంతాటిపల్లి గ్రామాల లోని మామిడి రైతులను ఉద్దేశించి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసారు. నవంబర్, డిసెంబర్ మాసాలలో మామిడి తోటలలో పూత సమానంగా రావటం కొరకు ఏ-10గ్రా, జింక్ ఏ-2.5గ్రా, బోరాన్ ఏ-1.25గ్రా లీటర్ నీటికి పిచికారీ చేయాలనీ, ముదురు మామిడి తోటలలో కల్టర్ వాడకం పైన అవగాహన కల్పించారు ఉద్యాన శాస్త్రవేత్త, మానస. ఆమె తేనె మంచు పురుగు నివారణకు సరైన సమయంలో 3దశలలో పురుగు మందులు పిచికారీ చేసుకోవాలని, ఎరువుల యాజమాన్యం పైన కూడా రైతులకి అవగాహన కలిగిస్తూ కాండం తొలిచే పురుగును నివారించటానికి ఆర్కా బోరర్ మందుతో మామిడి తోటలో డెమో కూడా నిర్వహించారు. వ్యవసాయ అధికారి రమేష్ రెడ్డి గారు వరి సాగును తగ్గిస్తు ఉద్యాన పంటల వైపు రైతులు ఆసక్తి చూపాలని తెలిపారు. రియా ఆగ్రోస్ కంపెనీ ప్రతినిధి హరీష్ గారు ఆయిల్ పామ్ సాగు పైన అవగాహన కలిగించారు. మామిడి రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రభాకర్ రెడ్డి,రైతు సేవ సిబ్బంది ప్రేమ్ సందీప్, హసీనా, చంద్ర, ప్రియదర్శిని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రియా ఆగ్రో మండల ప్రతినిధి ధర్మ తదితరులు పాల్గొన్నారు.

21న వేంపల్లెలో హజ్రత్ మదార్ షావలి ఉరుసు

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లెలోని పాపాఘ్ని నది ఒడ్డున వెలిసిన హజ్రత్ జిందేషా మదార్ షావలి ఉరుసు మహోత్సవం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలంగాణ వలి, పీరా సాహెబ్ లు తెలిపారు. 520 సంవత్సరాలకు పూర్వం హజ్రత్ సయ్యద్ ఖాజా దర్బార్ జిందేషా మదార్ షావలి అరబ్ దేశం నుండి బయలు దేరి భారత దేశం నందు ప్రవేశించి సన్మార్గం, సత్ ప్రవర్తన కొరకు ప్రచారం చేస్తూ దేవభక్తి పారయణులై వేంపల్లె గ్రామంలోని బిడ్డాల మిట్టలోని పాపాఘ్ని నది ఒడ్డున నివాసం ఏర్పాటు చేసుకొని దైవ చింతనలో మునిగి ప్రజలకు దైవ సందేశాన్ని వినిపిస్తూ సజీవ సమాధి అయినట్లు తెలిపారు. ఆనాటి నుండి ఈనాటి వరకు భక్తులకు కొంగు బంగారంగా ఆరాధిస్తున్నట్లు చెప్పారు. జిందేషా మదార్ షావలి ఉరుసు మహోత్సవానికి రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21 శుక్రవారం గ్రంథం, 22 శనివారం నాడు ఉరుసు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21వ తేదిన వేంపల్లెలోని పాత బాలికల పాఠశాల వద్ద ఉన్న సయ్యద్ పీరా సాహెబ్ సుహర్ వర్దియా ఇంటి నుండి మల్లెపూల చాందిని, గ్రంథం తీసుకొని దర్గా వరకు ఫకీర్లుతో జల్సా ఊరేగింపుతో వెళ్లడం జరుగుతుందని చెప్పారు. అలాగే 22వ తేదిన రాత్రి 7 గంటలకు పకిర్లుతో జెండా మెరవని కూడ ఉంటుందని చెప్పారు. అదే రోజు దర్గా వద్ద ప్రత్యేక ఖావాలీ పాట కచేరి ఉంటుందని చెప్పారు.

ఆలయ నిర్మాణానికి ఇరు వర్గాల ఘర్షణ

- పోలీసుల రాకతో సద్దుమణిగిన వివాదం

విశాలాంధ్ర-పీలేరు: పట్టణంలోని ఆర్టీసీ నల్లగుట్టలో ఓం శక్తి అమ్మవారి ఆలయం నిర్మించాలని పనులు మొదలు పెట్టాలని అక్కడికి రావడంతో మరో వర్గం అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య వివాదం మొదలు కావడంతో సమాచారం అందుకున్న పీలేరు అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ యుగంధర్ అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాలను పిలిచి విచారించారు. రమాదేవి వర్గం గుడి నిర్మించాలని తహశీల్దార్ పట్టా కూడా ఇచ్చారని దాంతోపాటు పంచాయతీ అధికారులు పర్మిషన్ కూడా ఇచ్చారని ఆమె తెలిపారు.మరో రామక్రిష్ణ వర్గం ఇక్కడ ఓం శక్తి గుడి నిర్మిస్తే లేని పోనీ సమస్యలు ఏర్పడతాయని విన్నవించారు. ఇరువర్గాల సమస్యలు విన్న తర్వాత తహశీల్దార్ దగ్గరకు వెళ్ళి సమస్య పరిష్కరించు కోవాలని ఘర్షణలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సిఐ యుగంధర్ హెచ్చరించడంతో వివాదం సద్దుమణిగింది.

సర్పంచులకు శిక్షణ

విశాలాంధ్ర-సింహాద్రిపురం: మండల పరిధిలోని స్థానిక ఎంపీడీవో ఆఫీస్ నందు గురువారం సర్పంచులకు ఉపసర్పంచ్ లకు పంచాయతీ కార్యదర్శులకు క్లీన్ అండ్ గ్రీన్ శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఏపీఓ జయ భారతి ఏపిఎం మంజునాథరెడ్డి సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

పరిశుభ్రత, పచ్చదనంపై శిక్షణ

విశాలాంధ్ర-లింగాల: లింగాల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పరిశుభ్రత, పచ్చదనం గల పంచాయతీలపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో మండలంలోని అన్ని పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, కొందరు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10గంటలకు ప్రారంభమై సాయంత్రం 5గంటల వరకు కొనసాగింది. కార్యక్రమంలో పంచాయతీలలో పరిశుభ్రత, పచ్చదనం, వ్యర్థాల నిర్వహణ, గ్రామాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ, "ప్రతి గ్రామం పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉండేలా ప్రతి పంచాయతీ సిబ్బంది కృషి చేయాలి. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలి" అని సూచించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ఉట్టి లోకేష్, ఉపాధి హామీ ఏపీఓ గంగరాజు, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శులు, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం

విశాలాంధ్ర-కడప వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ 9 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం బొటానికల్ గార్డెన్లో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. మొక్కలకి పాదులు తీసి నీళ్లు పోశారు మొక్కల చుట్టూ జొన్న పిచ్చి మొక్కలను తొలిగించి వేరు చేశారు అలాగే బొటానికల్ గార్డెన్లో ఉండే ప్లాస్టిక్ సీసాలను, ప్లాస్టిక్ కవర్స్ ను సేకరించి బయటకు తొలగించారు. ఈ కార్యక్రమంలో బొటానికల్ గార్డెన్ డైరెక్టర్ ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి, సి నారాయణరెడ్డి, వాలంటీర్స్ పాల్గొన్నారు.

సచివాలం ఇక్కడ - ఉద్యోగులు ఎక్కడ..?

విశాలాంధ్ర-తొండూరు: సచివాలంయ ఉంది మరి ఉద్యోగులు ఎక్కడని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గురువారం పలువురు ప్రజలు సచివాలయానికి వెళ్లారు అక్కడ ఖాళీగా కుర్చీలు దర్శనమివ్వడంతో ఆశ్చర్యపోయారు. ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో వారందరూ వెనుదిరిగారు. లేదా ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి పర్యటనా వెళ్లారా అంటే ఈ విషయం చెప్పేవారు లేరు. వివిధ పనుల నిమిత్తం వెళ్లిన ప్రజలు నిరీక్షించి చివరకు ఉద్యోగులు ఇక రారని తెలుసుకున్న మీదట వారందరూ తిరుగుముఖం పట్టారు. ఇప్పటికైనా సచివాలయంలో ఉద్యోగులు అందుబాటులో ఉండాలని స్థానికులు కోరుతున్నారు.

పసుపులేటి హరిప్రసాద్‌కు ఘనస్వాగతం

విశాలాంధ్ర-వాల్మీకిపురం: ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్‌కు గురువారం వాల్మీకి పురంలో ఘనస్వాగతం లభించింది. మదనపల్లె మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి వెళ్తున్న ఆయనకు స్థానిక జాతీయ రహదారి వద్ద జనసేన పార్టీ నాయకులు స్వాగతం పలికి శాలువతో ఘనంగా సత్కరించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యకర్తలంతా చిత్తశుద్ధితో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దూరం

- క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర-నందలూరు: వ్యాధిగ్రస్తులు వైద్యులు, సిబ్బంది సూచనలు సల హాలు పాటించడంతోపాటు ఆరు నెలల పాటు మందులు వాడితే పూర్తి స్థాయిలో క్షయ వ్యాధి దూరమవుతుందని మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు, నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్య నారాయణ ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వ నాథ్‌లు అన్నారు. ప్రధానమంత్రి టీబి ముక్తాభారత్ అభియాన్ కార్య క్రమంలో భాగంగా మండలంలోని 13మంది టీబీ పేషెంట్లను నాగిరెడ్డి పల్లి సర్పంచ్ జంబు సూర్యనారాయణ దత్తత తీసుకున్నారు. గురువారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వ్యాధి సోకిన వారు ప్రభుత్వం ఆరు నెలల పాటు ఉచితంగా అందించే మందులను వాడడంతో పాటు బహిరంగ ప్రదేశాలలో ప్రజలలో తిరగకుండా మాస్కులు కచ్చితంగా వాడాలన్నారు. తద్వారా వ్యాధి నుండి బయటపడవచ్చున్నారు. మంచి పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా శరీరంలో అధిక శక్తి లభిస్తుందన్నారు. క్షయ వ్యాధి పట్ల నిర్లక్ష్యం వహించ కుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంట్లో కూడా మాస్కు ధరించి ఉండాలన్నారు. అనంతరం రెండు నెలలకు సరిపడా పౌష్టిక ఆహార పదార్థాలను సర్పంచ్ జంబు సూర్యనారాయణ చేతుల మీదుగా అందజే శారు. జిల్లా క్షయ నివారణ అధికారి సుబ్రహ్మణ్యం, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రణీత్, శివరాం సిహెచ్ఓ వెంకటనారాయణ, ఎమ్ ఎల్ హెచ్ పి ఆరీఫ్, మాజీ మార్కెటింగ్ డైరెక్టర్ బెస్త సుబ్రహ్మణ్యం, తెలుగుదేశం నాయకులు తుమ్మాది శివకుమార్, తాజ్ మార్ట్ సయ్యద్ అఫ్జల్, శివ నరసింహులు, పఠాన్ మేహార్ ఖాన్, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

- మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం

విశాలాంధ్ర-పెద్దతిప్పసముద్రం: మండలంలో తుమ్మరకుంట1 ఉద యం 11గంటలైనా సచివాల యం సిబ్బంది కార్యాలయం తలుపులు తీ యకపోవడం సమస్యల వచ్చిన అర్జీ దారులు, విధులకు హాజరైన హౌసింగ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గంగాద్రి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల స్థాయి పర్యవేక్షణ లోపంతో సచివాలయం సిబ్బంది ఎప్పుడు పడితే అప్పుడు ఆఫీసుకు రావడం వెళ్లడం చేస్తున్నారు. ప్రతి కార్యాలయానికి అధికారులు 10గంటలకు విధులకు హాజరు కావాల్సి ఉంది. అయితే అధికారులు మాత్రం ఇష్టానుసారం విధులకు హాజరవు తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు సచివాలయంలో గ్రామస్తులకు అందుబాటులో ఉండాలనిపై అధికారులు చెబుతున్న గ్రామాలలో పనిచేసే అధికారులు సమయపాలన పాటించడం లేదు. సచివాలయంలో పనిచేసే సిబ్బంది నిర్లక్ష్యంగా విధులకు హాజరుతున్నారు. సమస్యలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయడం లేదని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నందలూరు రైల్వే అభివృద్ధికి కృషి చేయండి

విశాలాంధ్ర-నందలూరు: అన్నమయ్య జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ సూచనల మేరకు నందలూరు రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ మెంబర్ రాచూరి మురళి దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఏ. శ్రీధర్ ని సికింద్రాబాద్ రైల్వే నిలయంలో కలిసి నందలూరు రైల్వే అభివృద్ధికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంలో రాచూరి మురళి మాట్లాడుతూ నందలూరు రైల్వే స్టేషన్‌కు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలను చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, చెన్నై-ముంబై ట్రైన్‌లను నందలూరులో స్టాపింగ్స్ ఇవ్వవలసినది గా విజ్ఞప్తి చేయడం జరిగిందని అన్నారు. నందలూరు రైల్వే కేంద్రానికి సమీపంలో చెయ్యేరు నది ఉండటం వలన అక్కడ శుభ్రమైన నీరు అన్ని కాలాల్లో లభ్యమవుతోందని, అందువలన ట్రైన్లకు వాటరింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని కోరామన్నారు. నందలూరులో రైల్వేకు చెందిన వందల ఎకరాల స్థలం నిరుపయోగంగా ఉందని, ఆ భూమిని రైల్ ల్యాండ్ డెవల ప్మెంట్ అథారిటీ (ఆర్ఎల్‌డిఏ) పద్ధతిలో అభివృద్ధి చేయాలని కోరినట్లు తెలిపారు. సమస్యలపై స్పందించిన చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ శ్రీధర్ త్వరలోనే ట్రైన్ స్టాపేజీలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని, మిగి లిన రైల్వే అభివృద్ధి అంశాలు కూడా అత్యున్నత అధికారుల సమగ్ర కమిటీ సమావేశంలో పరిగణలోకి తీసుకుంటామని తెలిపినట్లు మురళి అన్నారు.

ఆర్టీసీ బస్ సర్వీసులు పెంచాలని వినతి

విశాలాంధ్ర-రామసముద్రం: రామసముద్రం నుండి ఆర్టిసి బస్ సర్వీసులు మరింత పెంచాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు అబ్బు కృష్ణంరాజు యాదవ్ తెలిపారు గురువారం మదనపల్లెలో మంత్రిని కలిసి వినత పత్రం ఇచ్చినట్లు చెప్పారు గతంలో చెంబ కూరు నుండి తిరుమల కు ఆర్టీసీ సర్వీస్ ఉండేదని తిరిగి ఆర్టిసి సర్వీసు ప్రారంభించాలని కోరినట్లు తెలిపారు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

న్యూమోనియాను అరికడదాం

- డిఆర్ఓ మధుసూదన్ రావు

విశాలాంధ్ర-రాయచోటి: న్యూమోనియాను అరికడదాం పిల్లల బాల్యాన్ని కాపాడుదామని అన్నమయ్య జిల్లా డిఆర్ఓ మధుసూదన్ రావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో జిల్లా ఇమ్యునైజేషన్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించబడిన పోస్టర్ను డిఆర్ఓ మధుసూదనరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ భారతదేశ ఆరోగ్య, సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రారంభించిన సోషల్ అవేర్‌నెస్ అండ్ యాక్షన్ టు న్యూట్రలైజ్ న్యుమోనియా కార్యక్రమం ముఖ్య ఉద్దేశం చిన్నపిల్లలలో నిమోనియా రాకుండా చేయడం వారికి తగిన సమయంలో టీకాలను అందించడం అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా న్యుమోనియా మరణాలను తగ్గించి పిల్లల బాల్యాన్ని కాపాడి వారి మంచి భవిష్యత్తుకు పునాది వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లక్ష్యం 2025 నాటికి బాల్య న్యుమోనియా మరణాలను 1,000 సజీవ జననాలకు 3 కంటే తక్కువకు తగ్గించడం అన్నారు. న్యుమోనియా నహీ, తో బచ్‌పన్ సాహి అనే ట్యాగ్‌లైన్ తో కూడిన పోస్టర్ ద్వారా న్యూమోనియా పై ప్రజల్లో అవగాహన పెంచి కేంద్ర ప్రభుత్వం ప్రవేశించిన లక్ష్యాలను చేరుకోవాలని డిఆర్ఓ ఇమ్యునైజేషన్ శాఖ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ శాఖ అధికారి ఉషశ్రీ ఆ శాఖ సిబ్బంది కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో వ్యక్తిత్వ వికాసం

విశాలాంధ్ర-రాయచోటి: రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో వ్యక్తిత్వ వికా సం, వృత్తి మార్గదర్శకతపై గురువా రం అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ప్రిన్సిపాల్ శివశంకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్ర మానికి ప్రధాన వనరుల వ్యక్తుల గు ణశేఖర్, జిల్లా ఆరోగ్య విద్యాధికారి (రిటైర్డ్), సుబ్బారాయుడు, మేనేజర్, సూపరిం టెండెంట్ నారాయణ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం క్రమశిక్షణ, నిజాయితీ సానుకూల దృక్పథంతో ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న శిక్షణా, ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని విద్యార్థులను ఆయన ప్రేరేపించారు. ఇంద్రప్రియదర్శిని, విభాగాధిపతి (ఇఇఇ), చెన్నకేశవ ప్రసాద్, విభాగాధిపతి(ఈసీఈ), నాగసురేంద్ర రెడ్డి, జనరల్ సెక్షన్ ఇన్‌చార్జ్, హెచ్ఓడిలు పాల్గొని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. ఐఎస్‌టిఇ కోఆర్డినేటర్ బుజ్జిబాబు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సహదేవ, ప్రిన్సిపాల్ శివశంకర్ పాల్గొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-పీలేరు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి జరి గిన దాడికి నిరసనగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెం కటేష్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరిం చారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయి పై కోర్టులోనే కాలి బూటు తో దాడి చేసిన లాయర్ కిషోర్ పై దేశభక్తిగా కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ తో నవంబర్ 17వ తేదీన ఢిల్లీ నడపొద్దున జంతర్ మంతర్లు దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహించబడునని, అన్నమయ్య జిల్లాలోని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి విద్యార్థి విభా గం నాయకులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గండికోట రెడ్డికుమార్, ఎంఎస్‌పి మండల అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, యువ నాయకులు చరణ్ కుమార్, అన్నవరం,, ప్రసాద్ నరేష్ లక్ష్మణ్, బాబు, వెంకటరమణ, సరోజ విద్యార్థి విభాగం యశస్విని పాల్గొన్నారు.

సచివాలయ అంశాలపై సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-సంబేపల్లె: సంబేపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సము దాయ అభివృద్ధి పనులు, సచివాలయ నిర్వహణ కార్యక్రమాలపై సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఎల్‌డీఓ, లక్ష్మీపతి, రాయచోటి అధ్యక్షత వహించారు. ఎంపీడీఓ టి.వెంకట సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపిడీఓ సునీల్ కుమార్, మండల్ సర్వేయర్ హరి పాల్గొన్నారు. గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల్లో పురోగతిపై సమీక్ష నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణపై సూచనలు అందించినట్లు అధికారులు తెలిపారు. అన్ని సచివాలయ సిబ్బందికి పై వివరాలను తెలియజేస్తూ, సమన్వయం కలిగి సమీక్ష సమావేశంలో తప్పనిసరిగా పాల్గొనాల్సిందిగా సూచించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు అవుదాం

విశాలాంధ్ర-వాల్మీకిపురం: అత్యవసర సమయాలలో రక్తం లభించక ప్రాణాలు సైతం కోల్పోతుంటారని అలాంటి వారి కోసం ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వెలివిషర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యురాలు లావణ్యరెడ్డి పేర్కొన్నారు. గురువారం వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 30మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుని రక్తదానం చేయాలని, ముఖ్యంగా యువత, విద్యార్థులు సేవా దృక్పథంతో ముందుకెళ్లాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శివరామ్, బ్లడ్బ్యాంక్ బృందం అమరావతి, అంజనాథ్, వినోద్, వినయ్, నరసింహులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాదేవి కుటుంబానికి న్యాయం చేయండి: సిపిఐ

విశాలాంధ్ర-కడప రూరల్: గండికోట కొట్టాలపల్లి గ్రామ వాసి అయిన పోలు గంగాదేవికి ఆమెకు సంబంధించిన భూమిని ఆన్లైన్లో చేయకుండా రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలోని పరిపాలన అధికారి అక్బాల్ భాషా గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గండికోట కొట్టాల పల్లెకు చెందిన పోలు గంగాదేవి అనే మహిళ తమ భర్త కు సంబంధించిన ఆస్తిని ఆన్లైన్లో తన పేరున ఎక్కించకుండా అనేక సాకులు చూపుతూ దాదాపు 5సంవత్సరాలు నుండి తమ కార్యాల చుట్టూ తిప్పుకుంటున్నారని వారన్నారు. తన భర్త చనిపోయి ఆమె పుట్టింటి దగ్గర నివాసం ఉండడం వల్ల ఆ గ్రామంలో ఉన్నటువంటి కొంతమంది వ్యక్తులు ఆమె భూమిని స్వాహా చేయడానికి ప్రయత్నిస్తున్నారని అందుకు రెవిన్యూ అధికారుల సహకారం పూర్తిగా ఉందని వారన్నారు వెంటనే ఆర్డీవో గారు తాసిల్దారు వారు విచారణ చేపట్టి ఆమె భూమి ఆమెకు చెందినట్లు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. బాధితురాలు పోలు గంగాదేవి సిపిఐ పట్టణ కార్యదర్శి రాంప్రసాద్ నాయకులు సుభాన్, నాగేంద్ర, సుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన జిల్లా ముస్కాన్ అధికారి

విశాలాంధ్ర-వాల్మీకిపురం: ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా ముస్కాన్ అధికారి డాక్టర్ ప్రభావతి వాల్మీకిపురం ప్రభు త్వాస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి లోని చిన్నపిల్లల కేర్ యూనిట్, వైద్య సేవలు, సదుపాయాల కల్పన తదితరం పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం స్థానిక వైద్యులతో సమీక్షాసమావేశం నిర్వహించి వైద్యులకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ప్రభుత్వాస్పత్రిలో మరింత వైద్యం దిశగా కావాల్సిన సౌకర్యాల కల్పన, సమస్యలు తదితరం పరిశీలించి నివేదికలు ఉన్నతాధికారులకు అందించడం జరుగుతుం దన్నారు. అలాగే ఆస్పత్రి అభివృద్ధి కోసం నిధులు మంచూరు దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాలతి, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-పీలేరు: ద్వితీయ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నేటి నుండి 20వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించ డం జరుగుతుందని గ్రంథాలయాధికారి అమ రనాథ్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల భాగంగా ఇందులో వివిధ కార్యక్రమాలు నిర్వహి మాచడం జరుగుతుందని తెలిపారు. పాఠకులు, ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రంథాలయ సేవలు సద్వినియోగం చేసుకోవాలని అయన తెలిపారు.

జనసేనలో కష్టపడిన వారికి గుర్తింపు: మంత్రి

విశాలాంధ్ర-పీలేరు: జనసేనలో రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిట (పీ.ఏ.సీ) చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం మదనపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివ రాం ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొనడానికి మదనపల్లికి విచ్చేశారు. పీలేరు నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షుడు బెజవాడ దినేష్ ఆధ్వర్యంలో చీకలబైలు వద్ద ఘన స్వాగతం పలకడం జరిగింది. జనసైనికులు పెద్ద సంఖ్యలో హర్షధ్వానాలతో మంత్రికి ఆత్మీయ స్వాగతం పలికారు. తరువాత మదనపల్లిలోని శ్రీదేవి గార్డెన్స్‌లో పశ్చిమ నియోజకవర్గాల వారీగా జరిగిన జనసేన పార్టీ సమీక్షా సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. జనసేనలో కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు వుంటుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూర్ జిల్లా అధ్యక్షులు, ఎపి రాష్ట్ర హస్తకళల చైర్మన్ హరిప్రసాద్, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బెజవాడ దినేష్, నియోజకవర్గ ముఖ్యనాయకులు, జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్

విశాలాంధ్ర-కడప రూరల్: యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్రతి పనిలోనూ అవినీతి అక్రమాలు అవకతవకలకు పాల్పడుతూ ప్రతిష్టను దిగజారుస్తున్న ఇంచార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మను తక్షణం తొలగించి విశ్వవిద్యాలయ ప్రతిష్టను కాపాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్రతి పనిలోనూ అవినీతి అక్రమాలు అవకతవకలు జరుగుతున్నాయని బహిరంగ చర్చకు వస్తే వాటిని నిరూపిస్తామని ఇదివరకే పత్రిక ముఖంగా తెలియజేశామని గుర్తు చేశారు. అయినా బహిరంగ చర్చకు రాకుండా సాంకేతిక తప్పిదం అంటూ కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నం చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. అక్రమాలకు పాల్పడుతున్న ఆచార్య పుత్త పద్మ తరపున ఖండనలు ఇస్తున్న వారైనా బహిరంగ చర్చకు రావాలన్నారు. విశ్వవిద్యాలయంలో గతంలోనూ ఇప్పుడు అవకతవకలు అక్రమాలు జరుగుతూనే ఉన్న ఉపకులపతి బెల్లంకొండ రాజశేఖర్ పట్టీ పట్టనట్టు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. అవినీతి అక్రమాలు కేంద్ర బిందువుగా ఉన్న ఆచార్య పుత్తపద్మ ను తక్షణమే సస్పెండ్ చేసి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అవినీతిని అంతు చూసే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

హాస్టల్ వసతి కల్పించాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-కడప రూరల్: ప్రతి ష్టాత్మకమైన కడప రిమ్స్ మెడికల్ కాలేజీలో డీఎంఎల్టీ, డీఎంఐటీ లాంటి అనేక పారామెడికల్ కో ర్సులు ఉన్నప్పటికీ అనేక మంది విద్యార్థులు పేద మధ్యతరగతి కు టుంబాల నుంచి చదువుకుంటు న్నారు. వీరికి హాస్టల్ వసతి లేక కాలేజీ నగరానికి సుదూర ప్రాంతంలో ఉండడం వలన గవర్నమెంట్ హాస్టల్లో వసతి పొందలేక రిమ్స్ పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్ హాస్టల్లకు అద్దె చెల్లించలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉన్నారు జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజ్ ఉన్నప్పటికీ వసతి అందుబాటులో లేక అనేక మంది విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులకు దూరం అవుతున్నారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రభుత్వం మెడికల్ కాలేజీల్లో పారామెడికల్ బిఎస్సి కోర్సులు అందులో అందుబాటులో ఉన్నప్పటికీ కడప రిమ్స్ మెడికల్ కాలేజీలో మాత్రం ఒక్క కోర్స్‌కి కూడా బీఎస్సీ అందుబాటులో లేకపోవడం దారుణమన్నారు. డిప్లొమా చదువుతున్న విద్యార్థులు 500మందికి పైగా ఉండగా వాళ్ళకి హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లాసహాయ కార్యదర్శులు అరుణ్, చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు తేజ, నాయకులు భరత్ పాల్గొన్నారు.

రాయితీ రుణాలు మంజూరు చేయాలి

- చేతివృత్తిదారుల సమాఖ్య డిమాండ్

విశాలాంధ్ర-కడప రూరల్: అర్హు లైన చేతి వృత్తి దారులకు, పేదలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయా లని చేతివృత్తుదారుల సమాఖ్య కడ ప జిల్లా ప్రధాన కార్యదర్శి వీరశేఖర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా చేతివృత్తుదారుల సమాఖ్య కడప జిల్లా సమితి ఆధ్వ ర్యంలో కడప బిసి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ జయసింహకి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో విశ్వకర్మ యోజన పథకం క్రింద, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి తరపున సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి 18నెలలు గడిచిందన్నారు. సబ్సిడీ రుణాలు మంజూరు చేసి స్వయం ఉపాధితో చేతి వృత్తి దారులందరూ తమ సొంత కాళ్లపై నిలదొక్కుకొని జీవించేందుకు ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కేశవ, జిల్లా సహాయ కార్యదర్శి వడ్ల భాగ్యలక్ష్మి, జిల్లా నాయకులు వెంకట రాములు, పొంగూరు నాగరాజు, బద్వేల్ ఏరియా కార్యదర్శి నాయకులు శివ ప్రసాద్, కొండయ్య, నరసింహాచారి, ప్రసాద్ ఆచారి, శివరాం ఆచారి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-వాల్మీకిపురం: లోక్అదాలత్ నందు ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే లా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా పోలీసు అధికా రులు ప్రజల కు చట్టం న్యాయాల పట్ల అవగాహన కల్పిస్తూ వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు నందు డిసెంబరు 13న జరగనున్న జాతీయ లోక్అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల ని స్థానిక జడ్జి గురు అరవింద్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక కోర్టు ఆవరణలో పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్అదాలత్ నందు కేసులు పరిష్కరించు కునేలా చూడాలన్నారు. అలాగే కక్షిదారులు కూడ క్షణికావేశంతో కేసులకు పోయి జీవితాలను దుర్భరం చేసుకోకుండా రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరిం చుకునేందుకు జాతీయ లోక్అదాలత్ కార్యక్రమం చక్కటి వేదిక అన్న విషయాన్ని గ్రహించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. సివిల్, క్రిమినల్, బ్యాంకు రుణాల కేసులు, రాజీకాదగ్గ కేసుల పరిష్కారంలో న్యాయవాదులు కూడా పూర్తిస్థాయిలో సహకరించి అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఏజీపీ రమణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిప్రకాష్, సెక్రటరి, ప్రసాద్, సీఐలు రాఘవరెడ్డి, అనీల్కుమార్, ఎస్ఐలు చంద్రశేఖర్, బాలకృష్ణ, న్యాయవాదులు, వివిధ బ్యాంకుల అధికారులు, మండల న్యాయసేవాధికార సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

విశాలాంధ్ర-పెద్ద తిప్పసముద్రం: స్థానిక ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో బుధవారం, గురువారం ప్రత్యేక హోమాలు, విఘ్నేశ్వర, సరస్వతి దేవి విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కార్య క్రమంఘనంగా నిర్వహించారు. వేద పండి తుల మంత్రోత్సవాల మధ్య ఈ కతువు జరి గింది. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి తన సొంత నిధులతో ఈ విగ్రహ ప్రతిష్టను రంగ రంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులలో ఆధ్యాత్మి కతను, దైవభక్తిని నింపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. పూజా కార్యక్రమాలకు హాజరైన వారికి విద్యార్థులకు తల్లిదం డ్రులకు అందరికీ భోజనం సమకూర్చారు పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రస్తుత విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె గదులకు వేలం..

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: స్థానిక పురపాలక కు చెందిన 5 గదులను బాడుగకు ఇచ్చేం దుకు వీలుగా ఈనెల 19 వ తేదీ ఉదయం 10:30 గంటలకు వేలం నిర్వహించను న్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలి పారు. ముద్దనూరు రోడ్డు లోని పాత మున్సి పల్ కార్యాలయం వద్ద గల 3 వ గది అలాగే లైబ్రరీ కాంప్లెక్స్ లోని 6,7,8,9 గ దులను అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. ఇందులో 8వ గది ని ఎస్టీలకు మిగిలినవి ఓసి వర్గానికి కేటాయించడం జరిగిందన్నారు. 3వ గదికి రూ.14వందలు, మిగతా వాటికి రూ.2వేల వరకు అద్దె ఖరారు చేసినట్లు కమి షనర్ వివరించారు. గుడ్ విల్ కింద రూ 5 చెల్లించాల్సి ఉంది అన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ప్రవేశ రుసుము కింద రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అథ్లెటిక్స్ పోటీలలో రాణించిన హాసిని

విశాలాంధ్ర-కలికిరి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వ హించిన ఎస్ఐఎఫ్, రాష్ట్రస్థాయి అట్లాటిక్స్ 100మీటర్ల పరుగు పందెంలోఅన్నమయ్య జిల్లా కలికిరి మండలం చాళ్లవాళ్ళ పల్లి ఉన్న త పాఠశాలకు చెందిన హాసిని రాణించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం హాసిని పాఠశాలకు తెచ్చి న గౌరవాన్ని కొనియాడారు. దేశ సాయి క్రీడల్లో కూడా రాణించాలని తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్యం ఉంటే చదువులో ముందుంటారు

విశాలాంధ్ర-రాయచోటి: ఆరోగ్యంగా ఉన్న విద్యార్థులు చదువులో ముందు ఉంటారని రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వసీం అక్రమ్ అన్నారు. రాయచోటి పట్టణం ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థిని విద్యార్థులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అన్నివేళలా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శుభ్రమైన ఆహారం త్రాగునీరు విద్యార్థులు తీసుకోవాలన్నారు. శ్వాసకోశ వ్యాధుల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు విద్యార్థులకు డాక్టర్ వసీం అక్రమ్ వివరించారు. ఈ వైద్య శిబిరంలో హెల్త్ సూపర్వైజర్ నూర్జహాన్, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉపకరణాల కొరకు నిర్ధారణ పరీక్షలు

విశాలాంధ్ర-రాయచోటి: దివ్యాంగుల (వికలాంగులు) ఉపకరణాల కొరకు నేడు ఉదయం 9 గంటలకు రాయచోటి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త జనార్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గం సంబంధించి 18 సంవత్సరాల లోపు దివ్యాంగ విద్యార్థిని, విద్యార్థులు హాజరుకావాలని కోరారు. హాజరయ్యే విద్యార్థులు సదరం సర్టిఫికెట్, యు డి ఐ డి కార్డు, ఆధార్, రేషన్ కార్డు, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తమ వెంట తీసుకురావాలన్నారు. యుడిఐడి కార్డు లేని వారు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిర్ధారణ పరీక్షలు తర్వాత దివ్యాంగ పిల్లలకు అవసరమైన బ్యాటరీ సైకిల్, వీల్ చైర్, ట్రై సైకిల్, వినికిడి యంత్రాలు రోలేటర్స్, చంక కర్రలు లాంటి ఉపకరణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండలంలోని గ్రామాలు వారిగా పం చాయతీ అభివృద్ధి ప్రణాళికలపై అన్ని గ్రామ సర్పంచులు ఉపసర్పంచ్లు గ్రీన్ అంబాసిడర్లకు గ్రామాలలో పారిశుద్ధ పనులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశా రు. ముఖ్యఅతిథులుగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు వీరనారాయణ రెడ్డి హాజరయ్యారైనట్లు మండల అభివృద్ధి అధికారి రామచంద్ర రెడ్డి పేర్కొ న్నారు. ఎంపిడివో నరసయ్య, డిప్యూటీ ఎంపీడీవో గంపా వెంకట సుబ్బయ్య, టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ..

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సభా భవనంలో గు రువారం సుస్థిర అభివృద్ధి లక్ష్యం, థీమ్..5 పరిశుభ్రత, పచ్చదనం కలిగిన పంచా యతీ అనే అంశంపై మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, పంచా యతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో వెంకటర మణయ్య, ఈటిసి సరళ, టీటీ భాను ప్రశాంత్ ఆయా అంశాలపై అవగాహన కల్పించారు.

శ్రీచరణికి అభినందనలు..

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: మహిళా క్రికెట్ ప్ర పంచ కప్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన శ్రీచరణిని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్క ర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రతినిధులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్ర పంచ కప్ క్రికెట్లో శ్రీ చరణి ప్రదర్శనపై ఆర్టీపిపి ఉద్యోగులు, కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పొన్నా శివయ్య, ప్రాంతీయ కార్యదర్శి ఓబులేసుతో పాటు భార్గవ్, రాము, దస్తగిరి, శివన్న తదితరులు పాల్గొన్నారు. శ్రీచరణి తండ్రి చంద్రశేఖర్ రెడ్డిని వీరు సత్కరించారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-గాలివీడు: ఎల్వీ ప్రసాద్ నే త్ర వైద్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గు రువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభిం చింది. స్థానిక నాయకుడు లోకేశ్వర్ రెడ్డి సహాయ సహకారాలతో లక్ష్మి ప్రథమ చికిత్స కేంద్రంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలకు చెందిన కంటి సమస్యలతో బాధపడుతున్నవారు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మొత్తం 200 మంది కంటి పరీక్షలు చేయించుకోగా, వారిలో 71మందికి అవసరమైన మందులు, అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. రిటైర్డ్ లెక్చరర్ కానాల భయ్యా రెడ్డి, వైద్యులు రామాంజులు, సాంబశివ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర-గాలివీడు: క్రీడలు మా నసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యా నికి దోహదపడతాయని ఎంఈఓ పిల్లి నాగరాజు తెలిపారు. గురువా రం రవిచంద్ర, గౌతమ్ పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన క్రీడా పో టీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి గౌరవం తీసు కురావాలన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాల న్నారు. విద్య మనిషిని జ్ఞానవంతుణ్ణి చేస్తే, క్రీడలు మనిషిలో జీవన పోరా లను నేర్పిస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా జీవితంలో భాగస్వా మ్యం అయినప్పుడు పరిపూర్ణత గల మనిషిగా ఎదుగుతారని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యం సైజు థామస్, షింటో ఇమ్మనుయేల్, చక్రవాండ్ల పల్లె మోడల్ ప్రైమరీ ప్రధానోపాధ్యాయులు గౌస్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

వేరుశనగ కాయలు పంపిణీ

విశాలాంధ్ర-పెద్ద తిప్పసముద్రం: మం డలంలోని రైతులకు రబీ సీజన్లో బోరు బావులు కింద వేరుశనగ పంటలు పం డించే రైతులకు కాయలను ఏవో ప్రేమ లత పంపిణీ చేశారు. ఉలవలు వేరుశనగ కాయలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని ఏవో తెలిపింది.

ధర్మకర్తల మండలి నోటిఫికేషన్ జారీ

విశాలాంధ్ర-సంబేపల్లె: విజయవాడ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ సంబేపల్లె దేవరాయ నల్ల గంగమ్మ ఆలయ ధర్మకర్తల మండలి నియామకం కొరకు నోటీస్ జారీ చేసినట్లు జిల్లా దేవాదాయ శాఖ అధికారి సి.విశ్వనాథ్ గురువారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ విజయవాడ కమిషనర్ జారీచేసిన నోటీస్ తేదీ నుండి 20 రోజులు లోపు అభ్యర్థులు దరఖాస్తులను చేసుకోవాలని తెలియజేశారు.

కష్టపడే వారికే టిడిపిలో గుర్తింపు..

- పార్టీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవంలో ఇన్‌ఛార్జ్ భూపేష్

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: కష్టపడే వారికి టిడిపిలో తప్పకుండా గుర్తింపు ఉంటుందని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ భూపేష్‌రెడ్డి అన్నారు. జమ్మలమడుగులోని పార్టీ కార్యాలయంలో నూత నంగా నియామకమైన మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీ బాధ్యులతో గురువారం ప్రమాణ స్వీకారోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. తొలుత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. భూపేష్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికి అవకాశాలు ఉంటాయని ఓపిక, సహనంతో ముందుకు సాగాలన్నారు. సీఎం చంద్రబాబు 2047విజన్‌తో ముందుకు సాగుతున్న నేపథ్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు సైతం కలిసి పనిచేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని భూపేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ సభ్యులు దేవగుడి నారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ మల్లికార్జున, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులుతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చోరీలను నియంత్రిస్తాం: డీఎస్పీ

విశాలాంధ్ర-సిద్ధవటం: వార్షికోత్సవ రికార్డ్స్ పరిశీలనలో భాగంగా మండల కేంద్రమైన సిద్ధవటం పోలీస్ స్టేషన్‌లో పలు విభాగాల రికార్డ్స్‌ను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చోరీల నియంత్రణ కొరకై రాత్రి వేళలో పోలీసుల గస్తీలు పల్లెనిద్ర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, రాబోయే స్థానిక ఎలక్షన్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని రౌడీ షీటర్లు గ్రామాలలో ఘర్షణలు, అల్లర్లు సృష్టిస్తే కఠినమైన చర్యలు తప్పవని కడపడీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ప్రమాదాలు అరికట్టేందుకు ప్రతిరోజు ఉదయాన్నేదూరప్రాంతాలకు వెళ్తున్న వాహనాలు నిలుపుదల చేసి వాహనదారులకు ఫేస్ వాషింగ్ తప్పనిసరిగా చేయించాలని దీనివల్ల ప్రమాదాలు నివారించవచ్చని అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే సమాచారం తెలపాలని, అన్నారు. ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు మండల ఎస్పై మహమ్మద్ రఫీ, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని పరిశుభ్రం చేసిన సర్పంచ్, ఎంపిటిసి

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: మండలం అనంతరాజుపేట పంచాయితీ పరిధి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని సువిశాలమైన క్రీడా మైదానంలో పిచ్చి మొక్కలు మెలిసి విద్యార్థులు గేమ్స్ ఆడడానికి ఇబ్బందులు పడుతున్నారు.పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రం చేసి సహకరించాలని అధ్యాపక బృందం సర్పంచ్ సుబ్రమణ్యం దృష్టికి, ఎంపిటిసి బండారు మల్లిఖార్జున దృష్టికి తీసుకుపోవడంతో మానవతా దృక్పథంతో తక్షణం స్పందించి ట్రాక్టర్ డోజర్ రప్పించి పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రం చేసి స్థానికుల నుంచి ప్రశంసలు పొందారు.అధ్యాపక బృందం సర్పంచ్‌కి, ఎంపిటిసికి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. హెచ్ఎం లలితకుమారి, తెలుగు మాష్టారు సుబ్రమణ్యంరెడ్డి, నాగేంద్ర, రత్నం, శరత్ కుమార్, పిడి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతాకోక చిలుకలను పార్కులో విడుదల చేసిన విసి

విశాలాంధ్ర-కడప వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర శాఖ ప్రయోగశాలలో క్యాపిటేటివ్ బ్రీడింగ్ ద్వారా సీతాకోక చిలుకలను ప్రయోగశాలలో ఉత్పత్తి చేసి సీతాకోక చిలుకల పార్కులో విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ విడుదల చేశారు. జంతు శాస్త్ర శాఖ సహా ఆచార్యులు విభాగాధిపతి ఎస్పీ వెంకటరమణ యోగశాలలో ఇవి జీవం పోసుకున్నాయి. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేనటువంటి బటర్ఫ్లై పార్కు వైవియూకే సొంతం కావడం విద్యాలయానికి వన్నెతెచ్చిందన్నారు. ఈ సందర్భంగా బటర్ ఫ్లై మ్యాన్ డాక్టర్ ఎస్ పి వెంకటరమణను విసి అభినందించారు. రిజిస్టర్ ప్రొఫెసర్ పద్మ, అకడమీక్ ఎఫైర్ డీన్ ప్రొఫెసర్ ఏజీ దాము మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు పార్క్ ఉపమవుతుందన్నారు. ఎస్పీ వెంకటరమణ మాట్లాడుతూ బటర్ఫ్లై పార్కు 500 మొక్కలలో పార్కు 300పై చిలుకు సీతాకోక చిలుకలతో అంకురించందన్నారు. 1000కి పైగా సీతాకోక చిలుక అభివృద్ధి పరిచామన్నారు. విశ్వవిద్యాలయంలో ఎకరా విస్తీర్ణంలోపార్కు అభివృద్ధి చెందుతోందన్నారు.

సీఎం టూర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేష్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: ఎన్టీఆర్ గృహ ప్రవేశాల పంపిణీ కార్యక్రమానికి రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం, దేవుడి పల్లెకు ఈ నెల 12న హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు సభ దగ్గర తెలుగుదేశం పార్టీ మైనార్టీ సీనియర్ నాయకుడు, కుప్పం పరిశీలకుడు గాజుల ఖాదర్ భాషాపై సీఎం టూర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ ప్రవర్తించిన తీరు పట్ల, ఆయన వాడిన భాష పట్ల మైనార్టీలను కించపరిచే విధంగా ఉందని పలువురు మైనార్టీలు మండిపడుతున్నారు. టిడిపిలోఎన్నో సంవత్సరాలుగా ఉన్న గాజుల ఖాదర్‌బాషా పార్టీని ఒక తల్లిగా భావించి చంద్రబాబును తన ప్రాణం కంటే ఎక్కువగా భావిస్తున్నా మైనార్టీ నేత గాజులను స్టేజి పైన పక్కకు లాగి అసభ్యకరమైన భాషతో ఆయన మాట్లాడటం సబబు కాదని రాయచోటి మైనార్టీలు టిడిపి పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది మనసుకు కలిగించే బాధ, ఆవేదన, దుఃఖం, విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి చర్యల వల్ల పార్టీకి నష్టం కలుగుతుందని కష్టపడే వ్యక్తికే న్యాయము లేదని పలువురు మైనార్టీలు చెప్పుకోవడం బట్టి చూస్తే మైనార్టీలలో పార్టీ మనుగడ కష్టమనే విషయం తెలుస్తుంది. పార్టీ కోసం నిత్యం 24గంటలలో 18గంటలు పార్టీ కోసం కష్టపడు తున్న వ్యక్తిపై ఇలాంటి ఘటనలు జరగడం చాలా బాధాకరమని రాయచోటి ముస్లిం మైనార్టీలలో చర్చ సాగుతుంది. ఇటువంటి చర్యల వల్ల పార్టీకి నష్టం కలుగుతుందని గురువారం స్థానిక మైనార్టీల వారి అభిప్రాయాలను వ్యక్తపరిచారు. అలాగే రాయచోటి నియోజకవర్గంలో మైనార్టీ ఓట్లు అధికంగా ఉండడం వల్ల తెలుగుదేశం పార్టీకి చాలా నష్టం జరుగుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు

విశాలాంధ్ర-తొండూరు: డ్వాక్రా మహిళలకు రూ.20లక్షల రుణాలు మంజూరైనట్లు వెలుగు అసిస్టెంటు ప్రాజెక్టు మేనేజరు వెంకటనారాయణ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం మండల పరిధిలోని సంతకొవ్వూరు గ్రామ సంఘం లోని సంధ్య స్వయం సహాయక సంఘం 10మంది సభ్యులకు డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రణాళిక ప్రకారం పై మొత్తం మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని పాడి గేదెలు, గొర్రెలు మేకలు కచ్చితంగా కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ జిలాని బాషా విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ అనురాధ. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి సన్మానం

విశాలాంధ్ర-పులివెందుల: అనంతపురం ఆర్అండ్‌బి అతిథి గృహంలో గురువారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డికి ఘన సన్మానం లభించింది. ఆ మేరకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు శ్రీ వెంకటప్పశాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిజన సమాజ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, విద్యా అభివృద్ధి ఉపాధి అవకాశాల విస్తరణపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్ళి , వాటిని మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. గిరిజన సమాజ అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రామగోపాల్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర కమిషన్ సభ్యుడు వెంకటప్ప కూడా గిరిజన సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిని సత్కరించి మొక్కను అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీ నారాయణ, గిరిజన శాఖ డైరెక్టర్ రమేష్ నాయక్, నరసింహులు, శీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ప్రెసిడెంట్ మోతిలాల్ పాల్గొన్నారు.

ఇంటింటా కుష్టువ్యాధి సర్వే చేపట్టాలి

విశాలాంధ్ర-పులివెందుల: ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు ఇంటింటా కుస్టువ్యాధిపై సర్వే చేపట్టాలని డాక్టర్ స్నేహ ప్రత్యూష పేర్కొన్నారు. స్థానిక నగరిగుట్ట పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌పై వైద్యసిబ్బంది, ఆశాలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశ, మగ వాలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి చర్మం మీద స్పర్శ లేని మచ్చలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి వారి వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న వైద్యాధికారి దగ్గర పరీక్ష చేయించి వాటికి సంబంధించిన చికిత్సను అందించాలన్నారు. దీనికోసం వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేయాలని ఈ వ్యాధి చికిత్స. కారణాలు నివారణ చర్యలను ప్రజలకు అవగాహన కల్పించారు అనంతరం కుష్టు వ్యాధి లక్షణాలు, చికిత్స విధానం తదితర అంశాలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వ హించారు ఈ కార్యక్రమంలో ప్రసన్నలత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ కార్యవర్గం ఎన్నిక



విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: ఎస్‌టియు కడప జిల్లా 79వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో వేంపల్లి నందు పోరుమామిళ్ల రీజినల్ కన్వీనర్‌గా వి.వి. కృష్ణారెడ్డిబీ జిల్లా కార్యదర్శిగా కె.వెంకటసుబ్బయ్యబీ ఉపాధ్యాయవాణికన్వీనర్‌గా ఎస్.రాజగోపాల్ రెడ్డిబీ జిల్లా కమిటీ సభ్యులుగా బి.శ్రీనివాస్, బీఈ.ఆనంద్, బీబి.వెంకట్రామయ్య, బీకె.కుమార్ బాబుని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, బి.కోడూరు మండల శాఖ అధ్యక్షులు బి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి బి.నాగ సుబ్బారెడ్డి, ఆర్థికకార్యదర్శి ఎస్.శ్రీనివాసులు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనవారు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, అలాగే విద్యా పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలియజేశారు.

మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ

విశాలాంధ్ర-లింగాల: మండలానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు లింగాల మాజీ సర్పంచ్ అలవలపాటి మహేశ్వర్ రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి భార్య నాగేశ్వరమ్మను తమ్ముళ్లు హరనాథ్ రెడ్డి, బాలశేఖర్‌ను ఎంపీ ఓదార్చి ధైర్యం చెప్పారు. మాజీ సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి మరణం పట్ల ఎంపీ అవినాష్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తరఫున పార్టీ తరఫున కుటుంబానికి పూర్తి సహాయం అందించడం తోపాటు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ "మహేశ్వర్ రెడ్డి పార్టీకి అంకితభావంతో పనిచేశారు. ఆయన సేవలు చిరస్మరణీయాలు" అని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ తాను అన్ని వేళల అండగా ఉంటామని ఎంపీ ఓదార్చి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బాబూరెడ్డి, పులివెందుల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మండల యూత్ కన్వీనర్ అలవలపాటి మనోహర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు అలవలపాటి వెంకట శ్రీనివాసులు రెడ్డి, పార్టీ నాయకుడు కేశంరెడ్డి నాగకృష్ణారెడ్డి, లోపట్నూతల సర్పంచ్ నాగ భూషణ్ రెడ్డి, లింగాల సర్పంచ్ జూలు,సీనియర్ నాయకుడు బాలశేఖర్ రెడ్డి, యువజన విభాగం నాయకుడు విజయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఎరువు దుకాణాలు ఆకస్మిక తనిఖీ

- ప్రతి రైతుకు బిల్లు అందజేయాలి: ఏవో నాగలక్ష్మి

విశాలాంధ్ర-రాజంపేట: పట్టణ కేంద్రంలో ఉన్నటువంటి ఎరువు దుకాణాలను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి రాయచోటి వారి ఆదేశాల మేరకు సహాయ వ్యవసాయ సంచాలకులు రైల్వే కోడూరు యస్.మని, రాజంపేట వ్యవసాయ శాఖ అధికారి జి.నాగలక్ష్మి ఆధ్వర్యంలో వంద శాతం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఐదు ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనికి చేయడం జరిగినది. ఈ తనిఖీలో ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌లో బ్యాలెన్స్‌ను, డిబిటిలో బ్యాలెన్సు, ఇన్వాయిస్‌లను గ్రౌండ్ బాలన్స్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క డీలరు కచ్చితంగా స్టాక్ రిజిస్టర్ నందు స్టాక్ అప్డేట్ ప్రతిరోజు పొందుపరచాలని తెలియజేశారు. ఎరువులు కొనుగోలు చేసే ప్రతి రైతుకు బిల్లు కచ్చితంగా ఇవ్వాలని కూడా తెలిపారు. అలాగే స్టాక్ బోర్డు నందు ఎరువుల స్టాక్స్‌ను కూడా పరిశీలించారు. ఈ తనిఖీలో 168580 విలువ గల స్టాక్స్‌కు స్టాప్ సేల్స్‌ను ఇవ్వడం జరిగిందన్నారు. దుకాణా దారులు నిబంధనలు వ్యతిరేకిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

- వ్యవసాయ అధికారి శ్రీదేవి

విశాలాంధ్ర-చెన్నూరు: మండలంలో చెన్నూరు 1, రామనపల్లి రైతుసేవ కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా నిర్ణయించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు వరి పంట పండించే రైతులు కొరకై వరి ధాన్యం సేకరణకు సేవా కేంద్రంను కొనుగోలు కేంద్రంగా కేటాయించి తద్వారా వరి పండించే రైతులకు వరి ధాన్యం కొనుగోలు చేయుటకు తగిన ఏర్పాట్లను చేయడం జరిగింది. ఇందులో భాగంగా వరి ధాన్యం గ్రేడ్ ఏ రకం క్వింటాల్ కు 2389రూపాయలు, సాధారణ రకం క్వింటాల్ 2369 రూపాయలు గాను ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని అన్నారు. అదేవిధంగా తేమ శాతం 17 శాతానికి మించరాదని, చెత్త, రాళ్ళు, తాలు ఒక శాతానికి మించరాదని చెడిపోయిన మరియు రంగు మారిన విత్తనాలు ఐదు శాతానికి మించరాదని పరిపక్వానికి రాని మరియు వంకర తిరిగిన గింజలు మూడు శాతానికి మించకూడదని రైతులను ఉద్దేశించి ఆమె తెలిపారు. సూచనలు సలహాలు కొరకై సంబంధిత రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి వరి పండించే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె తెలిపారు.